మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 55 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



## వందరోజుల పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండం

- ఇండియా కూటమి విజయం సాధిస్తోంది
- 75 ఏళ్ల మోడీకి పదవి ఎలా ఇస్తారు?
- మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



కొడంగల్ (ప్రజా మంటలు): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 33.5 శాతం ఓట్లు వచ్చాయని.. ఈ ఎన్నికల్లో అంతకు మించి వస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు తమ వంద రోజుల పాలనకు రెఫరెండమని తెలిపారు. బీజేపీ కూడా ఈ ఎన్నికలు మోదీ పాలనకు రెఫరెండం అని చెబుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొడంగల్‌లో కుటుంబసమేతంగా

మిగతా 3లో..

# పోలింగ్ ప్రశాంతం

- తెలంగాణలో ముగిసిన ఓటింగ్
- 5 గంటల వరకు 61.16 శాతం పోలింగ్
- 6 గంటల వరకు 75 శాతం వరకు నమోదైనట్లు అంచనా
- తుది పోలింగ్ శాతంపై నేడు స్పష్టత వచ్చే అవకాశం
- హైదరాబాద్‌లో అతి తక్కువగా పోలింగ్ నమోదు
- అమరచింతలో మొరాయించిన ఈవీఎంలు
- కొడంగల్‌లో ఓటేసిన సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం
- చింతమడకలో ఓటేసిన కేసీఆర్ దంపతులు
- ఒక్కు హక్కు వినియోగించుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు అభ్యర్థులు, సినీ ప్రముఖులు



హైదరాబాద్ (ప్రజా మంటలు): తెలంగాణలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ సమయం ముగిసింది. 6గంటల సమయానికి క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ ఉత్సాహంగా ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో గతంలో కంటే పోలింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉండటంతో రాత్రి 10 గంటల వరకు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. పోలింగ్ సమయం ముగిసే సరికి దాదాపు75 శాతం పోలింగ్ నమోదైనట్టు తెలుస్తోంది. తుది పోలింగ్ శాతంపై మంగళవారం ఉదయానికి పూర్తి స్పష్టత వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ చెదురుమదురు ఘటనల మినహా ప్రశాంతంగా ముగిసింది. మావోయిస్టు ప్రభావితప్రాంతాలైన ఐదు ఎంపీ నియోజకవర్గాల పరిధిలోని 13అసెంబ్లీ సెగ్మెంట్లు సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వరావుపేటలో సాయంత్రం 4గంటలకు పోలింగ్ ముగిసింది. జగిత్యాల జిల్లాలో ఓటేస్తూ ఫొటో తీసుకున్న జయరాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.తెలంగాణ రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు ప్రశాంతంగా కొనసాగింది. పలు పోలింగ్ కేంద్రాల్లో 6 గంటలలోపు నిల్చున్న ఓటర్లకు ఓటు హక్కు వినియోగించు కునేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పించారు. అక్కడక్కడ చెదురుముదురు సంఘటనలు మినహా సజావుగా పోలింగ్ కొనసాగింది. కాగా వనపర్తి జిల్లా అమరచింత జెడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్ 228/77లో ఈవీఎంలు మొరాయించాయి. రెండు గంటలుగా ఈవీఎంలు పని చేయకపోవడంతో ఓటింగ్‌ను నిలిపివేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్నం 3 గంటల వరకు 52.34 శాతం పోలింగ్ నమోదైంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో 39.92 శాతం పోలింగ్ నమోదైంది. మంథని..బెల్లంపల్లి లో ఎక్కువ శాతం ఓటర్లు క్యూ లైన్లో వేచి ఉన్నారు. అలాగే మంచిర్యాల లో సమయం ముగిసినప్పటికి ఓటర్లు బారులు తీరారు. అయితే ఉదయం నుంచే మందకొడిగా పోలింగ్ ప్రారంభం అయ్యింది. నగరంలో అయితే ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల వరకు 61.16 శాతం పోలింగ్ నమోదైంది. 65 శాతం దాకా పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉందని అన్నారు. ఇక సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు కూడా పోలింగ్ ప్రక్రియ ముగిసింది. తెలంగాణలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన 13 అసెంబ్లీ నియోజక వర్గాల్లో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. సాయంత్రం 4 గంటలకు క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. మిగిలిన 106 అసెంబ్లీ సెగ్మెంట్లలో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కొనసాగింది. మహబూబాబాద్, పెద్దపల్లి, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని సమస్యాత్మకమైన 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఉదయం మొదలయిన పోలింగ్ సాయంత్రం తెలంగాణ వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ఊపందుకుంది. అన్ని నియోజకవర్గాల పరిధిలో ఓటర్లు ఉత్సాహంతో ఓటు వేస్తున్నారు.

## లోక్‌సభ ఎన్నికలకు విశేషస్పందన

- తెలంగాణలో ప్రశాంతంగా పోలింగ్
- భద్రత మధ్య ఈవీఎంల తరలింపు
- రాష్ట్రవ్యాప్తంగా 38 కేసులు నమోదు - సీఈవో వికాస్‌రాజ్
- తుది ఓటింగ్ శాతంపై నేడు స్పష్టత వస్తుందని వెల్లడి



హైదరాబాద్ (ప్రజా మంటలు): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని సీఈవో వికాస్‌రాజ్ పేర్కొన్నారు. తుది ఓటింగ్ శాతం అనే వివరాలను రేపు వెల్లడిస్తామని తెలియజేశారు. ఇవాళ వివిధ కారణాలపై 38 కేసులు నమోదు చేసినట్లుగా తెలిపారు.: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించినట్లుగా తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన వికాస్‌రాజ్, రాష్ట్రంలో పోలింగ్ శాతం బాగానే నమోదైందని పేర్కొన్నారు. తుది ఓటింగ్ శాతం ఎంత అనేది రేపు వెల్లడిస్తామని తెలిపారు. ఇవాళ వివిధ కారణాలపై 38 కేసులు నమోదు చేశామని వివరించారు. జీపీఎస్ ఉన్న వాహనాల్లో ఈవీఎంలు తరలిస్తామన్నారు.ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి రూ.330 కోట్లు సొత్తు స్వాధీనం చేసుకున్నట్లుగా వికాస్‌రాజ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 14 వందల కేంద్రాల్లో పోలింగ్ కొనసాగుతోందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 44 స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాట్లు చేసినట్లుగా వివరించారు. ఈవీఎంలు తెల్లవారుజాము వరకు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరతాయని తెలిపారు. కచ్చితమైన పోలింగ్ శాతం రేపు మధ్యాహ్నం వరకు తెలుస్తుందన్నారు. పోలింగ్‌పై మంగళవారం స్క్రూటినీ ఉంటుందని, ఎక్కడైనా రీ-పోలింగ్

మిగతా 2లో..

## సీఎం పదవి నుంచి తొలగించాలనడం అవివేకం

- కేజ్రీవాల్‌కు వ్యతిరేక పిటిషన్‌పై సుప్రీం వ్యాఖ్య



న్యూఢిల్లీ, (ప్రజామంటలు): కేజ్రీవాల్‌ని ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించాలని వేసిన పిటిషన్‌ని సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తోసిపుచ్చింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీఎం కేజ్రీవాల్‌ని ఈడీ, సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయన ఇటీవలే బెయిల్‌పై బయటకి వచ్చారు. అయితే జైలు శిక్ష అనుభవిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి పదవికి అనర్హుడని పేర్కొంటూ కాంతి భాటీ అనే వ్యక్తి ఏప్రిల్‌లో ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్ విచారణకు హైకోర్టు నిరాకరించడంతో ఆయన సుప్రీం తలుపు తట్టారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కేజ్రీవాల్‌ని సీఎం పదవి నుంచి తొలగించాలని అడిగే చట్టపరమైన హక్కు పిటిషనర్‌కి లేదని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీంతో కేజ్రీవాల్‌కి భారీ ఊరట లభించినట్లైంది.

## అధికారమిస్తే మహిళల జీవితాలు మార్చేస్తాం

- కాంగ్రెస్ గ్యారంటీలతో పేదలకు మేలు
- వీడియో సందేశంలో సోనియా గాంధీ

3లో..



## నార్త్ కొరియాలో వింత ఆంక్షలు

- లిప్‌స్టిక్‌వాడకంపై నిషేధం
- మేకప్‌లపైనా అక్కడ ఆంక్షలు



ప్యోంగ్యాంగ్ (ప్రజా మంటలు): ఉత్తర కొరియాలో కఠిన చట్టాలు అమలులో ఉన్నాయి. ఫ్యాషన్ అంశంలో కూడా వాటిని పాటిస్తున్నారు. కాస్మటిక్స్ యూజర్స్‌కు పెనాల్టీ విధిస్తున్నారు. ఎరుపు రంగు లిప్‌స్టిక్ పై ఉత్తర కొరియాలో తాజాగా నిషేధం విధించారు. నిజానికి ఎరుపు రంగుకు కమ్యూనిజంతో లింకు ఉన్నా.. ఆ రంగు లిప్‌స్టిక్‌ను నార్త్ కొరియా బ్యాన్ చేయడం గమనార్హం. ఎక్కువగా మేకప్ వేసుకున్నవాళ్లను నార్త్ కొరియన్లు పట్టించుకోరు. మేకప్ వేసుకోవడాన్ని పశ్చిమ దేశాల సంస్కృతిగా ఉత్తర కొరియన్లు భావిస్తున్నారు. ఎరుపు రంగు లిప్‌స్టిక్ వేసుకున్నవాళ్లు ఎక్కువ అట్రాక్టివ్‌గా కనిపిస్తారని కొరియన్లు భావిస్తున్నారు. ఇది ప్రభుత్వ వైఖరికి విరుద్ధమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మహిళలు సాదాసీదాగా ఉండాలన్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకం అన్న విధానాన్ని పాటిస్తున్నారు. అందుకే అక్కడి చట్టాల ప్రకారం.. మహిళలు అతి తక్కువ స్థాయిలో మేకప్ ధరించాల్సి ఉంటుంది.రెడ్ లిప్‌స్టిక్ ఒక్కటే కాదు.. వ్యక్తిగతంగా అందంగా కనిపించాలన్న అంశాలపై ఉత్తర కొరియాలో అనేక ఆంక్షలు ఉన్నాయి. ఇటీవల కాలంలో కిమ్ జాంగ్ ఉన్ సర్కారు అనేక కాస్మటిక్ వస్తువులను బ్యాన్ చేసింది. మహిళలు స్కిన్నీ, బ్లూ జీన్స్ వేసుకోరాదు.


## తెలంగాణలో కొత్తశక్తిగా భాజపా

- అందులో ఏ మాత్రం సందేహం లేదు
- పట్టణాల్లో పోలింగ్ శాతం తగ్గినా భాజపాకే అనుకూలం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్ (ప్రజా మంటలు): ఇవాళ జరిగిన పోలింగ్‌తో తెలంగాణలో భాజపా కొత్తశక్తిగా నిలుస్తుందనడంలో సందేహం లేదని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు.కేంద్ర నాయకత్వం అనేక రకాలుగా తమకు సహకరించిందన్నారు. తెలంగాణ అభివృద్ధికి నడ్డా నాయకత్వంలో భాజపా సంపూర్ణ సహకారం లభించిందని చెప్పారు. తెలంగాణ విమోచన దినోత్సవాలను ఏటా అధికారికంగా నిర్వహించేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు.సమ్మక్క, సారక్క యూనివర్సిటీ, పసుపుబోర్డు, టెక్స్‌టైల్ పార్క్ వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను మోదీ తెలంగాణకు ఇచ్చారని గుర్తు చేశారు. త్వరలోనే వీటిని మోదీ చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ కుటిల ప్రయత్నాలను ప్రజలు పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తగ్గినా భాజపాకి అనుకూలంగా ఉందని భావిస్తున్నట్టు తెలిపారు. ముందుగానే చెప్పినట్టుగా.. ఈ ఎన్నికల్లో భాజపాకి మంచి ఫలితాలు రానున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజా నాడి




## నాల్గవ దశలో ఇండియా

గతంలో గెలిచిన 42 సీట్లు నిలబెట్టుకోలేని బిజేపి

కూటమిలో లేని ప్రాంతీయ పార్టీల మాటనే నెగ్గుతుందా ?

ఇప్పటి వరకు జరిగిన నాలుగు దశల ఎన్నికల్లో బిజేపి అనుకొన్న, ఉన్న స్థానాలను కూడా దక్కించుకోలేదని, తప్పని సరిగా ఇతర పార్టీల మద్దతు తీసుకోవాల్సి వస్తుందని, అసమయంలో వాటి గొంతెమ్మకోర్కెలను ఆమోదించక తప్పని స్థితిలో ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. బిజేపి గత ఎన్నికల్లో గెలిచిన 303 సీట్లలో కనీసం 125 సీతాలను కోల్పోతుందని, ఇప్పటి వరకు ఉన్న సమాచారం. ఇంత వరకు 380 సీట్లకు జరిగిన పోలింగ్ లో దక్షిణ భారతంలోని 5 రాష్ట్రాలలోని 130 సీట్లలో బిజేపి కనీసం 25 సీట్లు కూడా గెలవలేకపోతుంది.

వార్తా 2లో..

# కూటమిదే పైచేయి?



# ఎన్డీఏకు 400 సీట్లు పక్కా..

## - ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు చూస్తే అదే స్పష్టమవుతోంది

## - ధీమా వ్యక్తం చేసిన మోదీ

పాట్నా (ప్రజా మంటలు):

ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు చూస్తే.. ఎన్డీఏ కూటమికి 400 సీట్లు వస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ దీమా వ్యక్తంచేశారు.ఎండలు లెక్క చేయకుండా ప్రజలు దేశం కోసం ఓటింగ్‌లో పాల్గొంటారన్నారు. ఆయన ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్డీఏ కూటమికి 400 సీట్లు దాటవని, మోదీ పీఎం కాలేరన్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. "నేను ఆ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాను. దీనిపై చర్చ అవసరమే. బహుశా రాహుల్ ఎన్డీఏకు 399 లేదా 398 వస్తాయనుకుంటున్నాడేమో. అతడికి 400 ప్రామాణికం అనుకుంటా.. అందుకే అవి రావు అంటున్నాడు. మేము వస్తాయి అంటున్నాం. ఇదే తేడా..!ఇక ప్రధాని నేను అవుతానో లేదో అన్న వాదన విషయంలో మీరు రాహుల్‌వి, నావి 2014, 2019 ఎన్నికల ప్రసంగాలు, ప్రకటనలను ఒకసారి చూడండి. వారి పెద్ద నేత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకుండా.. రాజ్యసభకు వెళతారు అన్నాను. వయనాడ్‌లో ఎన్నికలు ముగియగానే రాహుల్ మరో సీటుపై దృష్టి పెడతాడని, అతడు అమేఠీకి వెళ్లడు అని అన్నాను. నా మాటలు నిజం అయ్యాయి. రాహుల్ మాట్లాడితే భూకంపం వస్తుందంటాడు.. ఏమీ రాలేదే..! అతడు ప్రతీ విషయంలో కుటుంబాన్ని చూస్తాడు. బోఫోర్స్ కుంభకోణాన్ని కప్పిపెట్టడానికి రఫేల్‌పై రచ్చ చేశాడు. వారు భారత సైన్యాన్ని బలహీనం చేయాలని చూస్తారు. 1962 యుద్ధంలో ఓటమి తర్వాత ఆర్మీపై ఆ కుటుంబం కోపం పెంచుకొంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు వారణాసిలో ఆయన నామినేషన్ వేసేందుకు పార్టీ శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. వారణాసిలో 14వ తేదీన నరేంద్రమోదీ నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఇప్పటికే ఈ ఏర్పాట్లను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షిస్తున్నారు. పార్టీ సీనియర్ నేత సునీల్‌బన్సల్ చాలా రోజుల నుంచి అక్కడే ఉండి పనులు చక్కబెడుతున్నారు. కాశీ విశ్వనాథుడు, కాలభైరవ ఆలయాలను కూడా ప్రధాని సందర్శించే అవకాశాలున్నాయి. బనారస్ హిందూవర్సిటీ నుంచి కాశీ విశ్వనాథుడి ఆలయం వరకు ఐదు కిలోమీటర్ల రోడ్‌షో సుమారు నాలుగు గంటలపాటు జరగనుంది.

**'ఆ నోట్ల గుట్టలకు 70 ట్రక్కులు కావాలి'**

విపక్ష ఇండియా కూటమి నేతలు పిరికివారని, అందుకే పాకిస్థాన్ అణు సామర్థ్యాన్ని చూసి భయపడుతున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు.ఆ కూటమి అధికారంలోకి వస్తే ప్రధాని పదవిని ఏడాదికో నేతకు పంచుతారని దుయ్యబట్టారు. బిహార్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. హాజీపుర్, ముజఫర్‌పుర్, సరణ్‌లో వరుసగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈడీ దాడుల పై విపక్షాలు చేస్తున్న ఆరోపణలకు గట్టి కౌంటర్ ఇచ్చారు."ఈడీ వంటి దర్యాప్తు సంస్థలకు వ్యతిరేకంగా వారు (విపక్ష నేతలు) ఎందుకు గొంతు చించుకుంటున్నారో నేను చెప్తాను. కాంగ్రెస్ హయాంలో ఈడీ కేవలం ఓ స్కూల్ బ్యాగులో దాచిన రూ.35లక్షలను మాత్రమే స్వాధీనం చేసుకోగలిగింది. అదే మేం అధికారంలో వచ్చిన తర్వాత దర్యాప్తు సంస్థ ఇప్పటివరకు దాదాపు రూ.2,200 కోట్ల అవినీతి సొమ్మును బట్టబయలు చేసింది. ఆ నోట్ల గుట్టలను తరలించాలంటే కనీసం 70 చిన్న ట్రక్కులు కావాలి. రాజకీయ నాయకులపై జరిపిన సోదాల్లో బయటపడిన డబ్బంతా దేశంలోని పేద ప్రజలదే" అని మోదీ వ్యాఖ్యానించారు.భాజపాలో మోదీ తర్వాత ప్రధాని అభ్యర్థి ఎవరు? అంటూ విపక్షాలు చేసిన విమర్శలపైనా ఆయన స్పందించారు. "పార్టీలో నాకు వారసులు లేరని అంటున్నారు. సామాన్య ప్రజలే నా వారసులు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్, ఆర్జేడీ వంటి పార్టీలు చెబుతున్నాయి. వారసత్వ పన్ను తీసుకురావాలని అంటున్నాయి. నేను బతికున్నంత వరకు అలా జరగనివ్వను. ప్రజల సొమ్మును దోచుకోవాలనుకునే వారి ప్రయత్నాలకు నేను అడ్డుగోడలా నిలబడతా" అని మోదీ అన్నారు.ఈ సందర్భంగా పాకిస్థాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలను ప్రధాని తిప్పికొట్టారు. "పిరికివాళ్లతో నిండిన విపక్షం పట్ల మనం అప్రమత్తంగా ఉండాలి. సర్జికల్ దాడులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ.. ఉగ్రవాదంపై పాకిస్థాన్‌కు క్లీన్ చిట్ ఇస్తున్న ఆ నేతలు.. మన ఆయుధ సంపత్తిని కూల్చివేయాలనుకుంటున్నారు. ఇండియా కూటమి ఓ ఫార్ములాపై పనిచేస్తోంది. ఒకవేళ వారు అధికారంలోకి వస్తే ఏడాదికో నేత ప్రధానిగా ఉంటారు. అప్పుడు దేశం ఎలాంటి గందరగోళ పరిస్థితుల్లోకి వెళ్తుందో ఊహించండి. వారిదో విఫల కూటమి" అని ధ్వజమెత్తారు.

# ముంబైలో గాలి వాన బీభత్సం

## - కూలిన భారీ హోర్డింగ్

## - నలుగురు మృతి.. 59మందికి గాయాలు

## - 15 విమానాలను దారిమళ్లింపు



హైదరాబాద్ (ప్రజా మంటలు):

ముంబయిలో ఈదురుగాలులతో కూడిన వర్షం పెను భీభత్సం సృష్టించింది. ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేపై పంత్‌నగర్ వద్ద పోలీస్ గ్రౌండ్ పెట్రోల్ పంప్‌లో భారీ హోర్డింగ్ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో నలుగురు మరణించగా, 59 మంది గాయపడ్డారు.మహారాష్ట్ర ముంబయిలో ఈదురుగాలులతో కూడిన వర్షం పెను భీభత్సం సృష్టించింది. ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేపై పంత్‌నగర్ వద్ద పోలీస్ గ్రౌండ్ పెట్రోల్ పంప్‌లో భారీ హోర్డింగ్ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో నలుగులు మరణించగా, 59 మంది గాయపడ్డారు. హోర్డింగ్ కింద అనేక మంది చిక్కుకుపోయారు. పోలీసులు, విపత్తు నిర్వహణ సిబ్బంది చిక్కుకుపోయిన వారిని బయటకు తీశారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బృహన్ ముంబయి అధికారులు తెలిపారు. గాలి దుమారం తీవ్రతతో పాటు దృశ్య నాణ్యత పడిపోవడం వల్ల ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయంలో గంటపాటు కార్యకలాపాలు నిలిచిపోయాయి. 15 విమానాలను దారిమళ్లించారు. సాయంత్రం 5 గంటల తర్వాత విమాన సేవలను పునరుద్ధరించారు. అకస్మాత్తుగా గాలులతో కూడిన వర్షం కురవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. లోకల్ రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి.

# రాయ్‌బరేలితో మా బంధం విడదీయలేనిది

## - భాజపా రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోంది

## - ఎన్నికల ప్రచారంలో రాహుల్ - ఇక పెళ్లి చేసుకోక తప్పేలా లేదు

## - రాయబరేలి ప్రచారంలో ప్రజల ప్రశ్నలకు రాహుల్ స్పందన

లక్నో (ప్రజా మంటలు):

బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా రాయ్‌బరేలితో కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.ఇందిరా గాంధీ, సోనియా గాంధీ ఇక్కడి నుంచే పోటీ చేశారన్న రాహుల్.. ఇది తమకు కర్మభూమి లాంటిదన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ మొన్నటి వరకు పోటీ చేస్తూ వచ్చారు. ఆమె స్థానంలో రాహుల్ గాంధీ పోటీలో ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం ప్రియాంక గాంధీతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో బీజేపీ, ఎన్డీయే సర్కారు వైఖరిపై ఆయన తీవ్రంగా స్పందించారు. కాగా ఇక పెళ్లి చేసుకోక తప్పేలా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలీలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగిన విషయం తెలిసిందే. కేరళ వయనాడ్ ఎంపీ స్థానం మరోసారి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఆయన సిట్టింగ్ ఎంపీ. అలాగే, కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీలో సైతం బరిలోకి దిగారు. ఇక్కడ ప్రచారంలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సభలో పాల్గొన్న పలువురు జనం రాహుల్ జీ ఎప్పుడు పెళ్లి చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్పందిస్తూ.. 'ఇప్పుడు నేను త్వరలో పెళ్లి చేసుకోక తప్పేలా లేదు (అబ్ జల్దీ హి కర్నీ పడేగీ)' అని నవ్వి అభివాదం చేస్తూ ప్రసంగాన్ని ముగించారు. అక్కడే ఉన్న ప్రియాంక గాంధీ సైతం నవ్వుతూ ఉండడం కనిపించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# భాజపాకు మళ్లీ అధికారం అసాధ్యం

## - మోదీ ఈసారి గెలిస్తే దేశంలో మళ్లీ ఎన్నికలుండవు - కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

రాంచీ (ప్రజా మంటలు):

భాజపా మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి ముప్పు ఉందన్న ఆయన, ఈసారి మోదీ విజయం సాధిస్తే భవిష్యత్తులో ఎన్నికలు ఉండవన్నారు.ఝార్ఖండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఖర్గే.. కేంద్ర ప్రభుత్వంపై మరోసారి విరుచుకుపడ్డారు. 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయి. ప్రజలు ప్రమాదంలో ఉన్నారు. ప్రాథమిక హక్కులు లేకుంటే పౌరులు బానిసలుగా మారుతారు. మోదీ మరోసారి విజయం సాధిస్తే భవిష్యత్తులో ఎన్నికలు నిర్వహించరు. హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారు. ఇదే విధంగా పారిశ్రామికవేత్తలను అరెస్టు చేసే ధైర్యం ఎందుకు చేయడం లేదు' అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. వీరి నుంచి టెంపోల కొద్దీ నల్లడబ్బు కాంగ్రెస్‌కు ఏమైనా అందిందా? అని మోదీ ఇటీవల ప్రశ్నించడంపై ఖర్గే ఈ విధంగా స్పందించారు.కేంద్రంలో విపక్షాల కూటమి 'ఇండియా' అధికారంలోకి వస్తే.. ఇప్పటివరకు అరెస్టైన కూటమి నేతలందరికీ స్వేచ్ఛ లభిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ఏదేమైనా.. ఈసారి మోదీ అధికారంలోకి రావడం అసాధ్యమన్నారు. ఎన్నికల బాండ్ల రూపంలో భాజపాకు విరాళాలు ఇచ్చిన వారు కీలక కాంట్రాక్టులను పొందారని ఖర్గే ఆరోపించారు.జుల పాటు స్వదేశానికి తిరిగి రాలేదు" అని మాలవీయ ఎక్స్ వేదికగా గుర్తు చేశారు.

## ఇండియా కూటమి అధికారంలోకి వస్తే జూన్ 5నే నా విడుదల

## - కేజ్రీవాల్ ఆశాభావం

దిల్లీ (ప్రజా మంటలు):

విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తే తాను తిహాడ్ జైలు నుంచి బయటకు వస్తానని దీల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు.జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న విషయం తెలిసిందే. ఇండియా కూటమికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగే మెజారిటీ వస్తే జూన్ 5నే తాను జైలు నుంచి విడుదలవుతానని ఆప్ కౌన్సిలర్లతో సోమవారం జరిగిన సమావేశంలో కేజ్రీవాల్ అన్నారు.దిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్ అరెస్టయిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం జూన్ 1 వరకు సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తిరిగి జూన్ 2న జైల్లో లొంగిపోవాల్సి ఉంది. జూన్ 1న సార్వత్రిక ఎన్నికల ఏడు దశల పోలింగ్ ముగియనుండగా.. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి.తిహాడ్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సమయంలో తనను అవమానించేందుకు ప్రయత్నించారని కేజ్రీవాల్ ఆరోపించారు. తన సెల్‌లో ఉన్న రెండు సీసీటీవీ కెమెరాలను 13 మంది అధికారులు నిరంతరం పర్యవేక్షించేవారని పేర్కొన్నారు. ఆ ఫుటేజీని ప్రధానమంత్రి కార్యాలయానికి కూడా పంపినట్లు ఆరోపించారు. తనపై మోదీకి అంత అక్కసెందుకో అర్థం కావడం లేదన్నారు.ఆప్ నేతలను ప్రజలు ఎంతో గౌరవంతో, ప్రేమతో చూస్తున్నారని కేజ్రీవాల్ అన్నారు. భాజపా మాత్రం భయపెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆదివారం పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమైన విషయం తెలిసిందే. తాను జైల్లో ఉన్నప్పుడు ఆప్ ఎమ్మెల్యేల్లో విభజనకు భాజపా విఫలయత్నం చేసిందన్నారు. కానీ, అందరూ ఐక్యంగా ఉండి వారి ఎత్తుగడలను తిప్పికొట్టారన్నారు. దీంతో పార్టీ మరింత బలం పుంజుకుందని పేర్కొన్నారు. ప్రధాని మోడీ తనపైన ఎందుకు అంత కక్ష పెట్టుకున్నారో తనకు తెలియదని ఆయన చెప్పారు. ఆప్ నాయకులంటే ప్రజలకు గౌరవంతోపాటు అభిమానం ఉందని, మనం చేసే పనులను చూసి బిజెపి నాయకులు భయపడుతున్నారని ఆయన అన్నారు. జూన్ 2న తాను తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, జూన్ 4న జైలులో నుంచే ఎన్నికల ఫలితాలను గమనిస్తుంటానని ఆయన చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే జూన్ 5న తాను జైలు నుంచి బయటకు వస్తానని కేజ్రీవాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా..ఆదివారం పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమైన కేజ్రీవాల్ తన అరెస్టు తర్వాత బిజెపి ఎన్నికల ప్రయత్నాలు చేసినప్పటికీ చీలిపోనందుకు వారిని అభినందించారు. తన అరెస్టు తర్వాత చీలిపోకుండా మరింత సంఘటితమైనందుకు ఆప్ ఎమ్మెల్యేలను ఆయన అభినందించారు.

# సీబీఎస్ఈ ఫలితాలు విడుదల

## - పదో తరగతిలో 93.60.. 12వ తరగతిలో 87.98శాతం ఉత్తీర్ణత

దిల్లీ (ప్రజా మంటలు):

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (అబాఇ) 10, 12వ తరగతి ఫలితాలు వచ్చేశాయి.ఈ ఉదయం పన్నెండో తరగతి ఫలితాలను ప్రకటించిన బోర్డు.. తాజాగా పదో తరగతి రిజల్ట్స్‌ను ప్రకటించింది. విద్యార్థులు తాము సాధించిన స్కోరును వెబ్‌సైట్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. రోల్ నంబర్, పుట్టిన తేదీ, స్కూల్ నంబర్, అడ్మిట్ కార్డు నంబర్‌లను ఎంటర్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. అలాగే, డిజీలాకర్, ఉమాంగ్ మొబైల్ యాప్‌ల ద్వారా కూడా రిజల్ట్స్ పొందొచ్చు. పదో తరగతిలో మొత్తం 93.60శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 2.12లక్షల మందికి 90శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. ఇందులో 47,983 మంది 95శాతానికి పైగా స్కోరు సాధించారు. అత్యధికంగా తిరువనంతపురంలో 99.75శాతం, విజయవాడలో 99.60 శాతం, చెన్నైలో 99.30శాతం, బెంగళూరులో 99.26శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి మార్చి 13వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. ఇక, ఈ ఏడాది 12వ తరగతిలో మొత్తం 87.98శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 91.52శాతం ఉత్తీర్ణతతో అమ్మాయిలు రాణించారు. 85.12శాతం మంది బాలురు ఉత్తీర్ణత సాధించారు. 1.16లక్షల మంది విద్యార్థులకు 90శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. ఇందులో 24,068 మంది విద్యార్థులు 95శాతానికి పైగా స్కోరు సాధించినట్లు బోర్డు వెల్లడించింది. అత్యధికంగా తిరువనంతపురంలో 99.91శాతం, విజయవాడలో 99.04శాతం, చెన్నైలో 98.47శాతం, బెంగళూరులో 96.95శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు 12వ తరగతి పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. విద్యార్థుల్లో అనారోగ్యకరమైన పోటీని నివారించేందుకు సీబీఎస్ఈ బోర్డు గత కొన్నేళ్లుగా మెరిట్ జాబితాలను వెల్లడించకూడదని నిర్ణయించిన విషయం తెలిసిందే.

# ఇండియా కూటమిదే ఆధిక్యం

## - ఎన్డీఏ 190 స్థానాలకే పరిమితం:మమత

కోల్‌కతా (ప్రజా మంటలు):

కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలోని కాషాయ కూటమిని మట్టికరిపించి విపక్ష ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకొస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.ఇండియా కూటమి బీజేపీని నిలువరించేలా తాము బెంగాల్ నుంచే కూటమికి సాయం చేస్తామని చెప్పారు. తనకు అందిన సమాచారం ప్రకారం ఎన్డీయే కేవలం 190 నుంచి 195 స్థానాలకే పరిమితమవుతుందని, విపక్ష ఇండియా కూటమి 315 స్థానాల్లో గెలుపొందుతుందని అన్నారు.ఉత్తర 24 పరగణాల జిల్లా బన్గావ్‌లో దీదీ లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మోదీ సర్కార్‌కు భంగపాటు తప్పదని ఆమె పేర్కొన్నారు. విపక్ష ఇండియా కూటమి కేంద్రంలో అధికార పగ్గాలు చేపడుతుందని దీదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రధాని మోడీవి మతపర ప్రసంగాలు

**- చర్యలకు ఈసీ ఆదేశించాలంటూ పిటిషన్ - మెరిట్ లేదంటూ తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు**

న్యూఢిల్లీ (ప్రజా మంటలు):

లోక్‌సభ ఎన్నికల్లో మతపరమైన విభజన ప్రసంగాలు చేయడం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉల్లంఘించారని, ఆయనపై చర్యలకు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని, విచారణకు అర్హమైనది కాదని జస్టిస్ సచిన్ దత్తా తీర్పునిచ్చారు.పిటిషనర్లు చేసిన ఫిర్యాదును చట్టానికి అనుగుణంగా స్వతంత్రంగా అంచనా వేసి చర్య తీసుకునే అధికారం ఎన్నికల కమిషన్‌కు అందని కోర్టు స్పష్టం చేసింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదనందున తోసిపుచ్చు తున్నట్టు పేర్కొంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు పాల్పడినట్టు ముందుగానే పిటిషనర్ ఒక నిర్ణయానికి రావడం పూర్తిగా అనుచితమని కూడా కోర్టు తెలిపింది. ప్రధాన మంత్రి, ఇతర బీజేపీ నేతల విద్వేష ప్రసంగాలపై ఈసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పిటిషనర్లు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని బన్స్వారాలో ఈనెల 21న ప్రధానమంత్రి చేసిన ప్రసంగాన్ని వారు ప్రస్తావించారు. షహీన్ అబ్దుల్లా, అమితబ్ పాండే, దేబ్ ముఖర్జీ అనే ముగ్గురు హైకోర్టులో ఈ పిటిషన్ వేశారు.

# కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొత్తగా సాగాలి

**దేశంలో అనేకానేక సమస్యలపై చర్చకు సిద్ధం కావాలి - కేంద్ర,రాష్ట్రాల సంబంధాల్లో అగాథం పూడ్చాలి**

**రాష్ట్రాల హక్కులను హరించే చర్యలను పక్కన పెట్టాలి**

న్యూఢిల్లీ,మే13దిల్లీ (ప్రజా మంటలు):

మరో మూడు విడల్లో ఎన్నికలు ముగిసి, జూన్ 4న ఫలితాలు వెలువడ్డ తరవాత కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడనుంది. కొత్తగా ఏర్పాడే ప్రభుత్వం కొత్త ఆశలతో ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రధానంగా ఇప్పటి వరకు జరిగిన అనేక అవకతవకలపై వచ్చిన విమర్శలను ముందుకు పెట్టుకుని పాలనను మరింత పారదర్శకంగా ముందుకు సాగించాలి. ఇంతకాలం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై బిజెపి ప్రభుత్వం కేంద్ర విచారణ సంస్థలను, గవర్నర్లను ప్రయోగించి, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న తీరును పరోక్షంగా సుప్రీం గతంలోనే హెచ్చరించింది. గవర్నర్ల తీరును సుప్రీం పలు సందర్భాల్లో ఆక్షేపించింది. ఈ క్రమంలో కేంద్రంలో ఎన్‌డిఎ కూటమి, ఇండియా కూటమిల్లో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేసినా గతంలో చేసిన పాపాలను కడిగి వేసుకోవాలి. కొత్తగా పాలనకు శ్రీకారం చుడితేనే దేశం ముందుకు వెళ్లగలదు. ప్రధానంగా గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి. ఇది దేశంలో ఆర్థిక భారాన్ని కలిగిస్తుందే తప్ప మరోటి కాదు. ఈ భారాన్ని తొలగించుకుంటే ఖజానాపై భారం తప్పుతుంది. అలాగే రాష్ట్రాల్లో ప్రశాంత వాతావరణం ఉంటుంది. ఇదే సమయంలో రాష్ట్రాల హక్కులకు ఇబ్బంది కలిగించే ప్రయత్నాలను ఎదుర్కోవడానికి, అధిగమించడానికి, పోరాడటానికి, ప్రతిఘటించడానికి రాష్ట్రాలు సమిష్టితో ముందుకు వెళ్లాల్సి ఉంది. అన్ని ాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏకం కావాల్సి ఉంది. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల సముదాయాన్ని ఏర్పాటు చేయాలి. రాష్ట్రాలకు మరిన్ని హక్కులు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేకున్నా ఉన్న హక్కులను కాలరాయకుండా చూడాలి. ఇందుకు ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా నిబద్ధతగా పాలన చేయాలి. రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలి. ఇది జరగాలంటే రాజకీయాల హద్దులు దాటి ఐక్యంగా కలిసి రావాల్సి ఉంటుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణం దృష్ట్యా, భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావడం, ఐక్య ఫ్రంట్ ఏర్పాటు చేయడం చాలా ముఖ్యం. భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలు కలిస్తేనే విజయం సాధ్యమవుతుంది. ఈ విజయమే ఈ దేశానికి, సామాజిక న్యాయం, సమానత్వం, లౌకికవాద ఆదర్శాలకు భరోసానిస్తుంది. అటువంటి విజయాన్ని సాధించేందుకు ప్రతిపక్షం చర్యలు చొరవ చూపుతుందా అన్నది చూడాలి. కమ్యూనిస్ట్ పార్టీ అన్ని సమయాలలో కేంద్ర, రాష్ట్ర సంబంధాల సమస్యను తీవ్రంగా తీసుకుని పోరాడుతోంది. గతంలో కాంగ్రెస్ అవలంబించిన్న విధానాలను బిజెపి దూకుడుగా కొనసాగించిందే తప్ప మార్పులకు శ్రీకారం చుట్టలేదు. ప్రధానంగా రాష్ట్రాల ప్రభుత్వాలను కొత్త తరహాలో కూల్చివేస్తోంది. కేంద్రం-రాష్ట్ర సంబంధాలను ప్రజాస్వామ్యకరించడం వారి ఎజెండాలో లేదని తేలిపోయింది. రాష్ట్రాలకు హక్కుగా ఉన్న వాటి కోసం పోరాడేందుకు కాంగ్రెస్ సిద్ధం కావాలి. గతంలో ఏ ఒక్క అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తడానికి ముందుకు వచ్చినా చర్చలకు అవకాశం లేకుండా చేశారు. కేంద్రం-రాష్ట్ర సంబంధాలను ప్రజాస్వామ్యీకరించడం చాలా అవసరం. తద్వారా రాష్ట్రాల హక్కులు రక్షించ బడతాయి. దేశం ఐక్యత, సమగ్రతను కాపాడేలా చూసుకోవాలి. దీన్ని పరిగణనలోకి తీసుకునే చర్యలు ఇప్పుడు దేశానికి అవసరం. భిన్నత్వంలో ఏకత్వమే మనబలం. సమాఖ్య వ్యవస్థను ధ్వంసం చేయరాదు. 1959లో సభలో మెజారిటీ ఉన్నప్పటికీ కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో ,కేంద్ర-రాష్ట్ర సంబంధాల అప్రజాస్వామిక స్వభావం తెరపైకి వచ్చింది. ఇకపోతే రాష్ట్రాలు విచ్చలవిడిగా అప్పులు చేయడాన్ని అడ్డుకోవాలి. అప్పులు చేసి పందేరాలు చేసే పథకాలను ఆపగలగాలి. ఇష్టం వచ్చినట్లుగా నగదు బదిలీలపై ఆంక్షలు విధించాలి. రాష్ట్రాల రుణ భారాన్ని తగ్గించడం, వారి రుణాలపై వడ్డీని తగ్గించడం, కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను పెంచడం వంటి వాటిపై సమగ్ర చర్చ చేయాల్సి ఉంది.

పన్నుల భారంతో ఆర్థికమాంద్యం

# ప్రజల్లో తగ్గుతున్న కొనుగోలు శక్తి చమురు ధరలతో ఆర్థికంగా దెబ్బ

దిల్లీ (ప్రజా మంటలు):

యుద్ధాలు, అంతర్జాతీయ పరిణమాల కారణంగా చమురు, సహజవాయువుల ధరలు విపరీతంగగా పెంచుతూ పోవడం వల్ల దేశంలో తయారీరంగం కుదేలయ్యింది. అలాగే ధరల పెరుగుదలకు కారణమయ్యింది. ఈ ధరలపై పన్నుల వసూళ్లు కూడా పెంచడంతో మరింతగా ఆర్థిక రంగం కుదేవలుతూ వస్తోంది. దీనికి పరిస్కారం కనుగొనకుండా ఆదాయ మార్గం పెరిగిందన్న ధోరణిలో కేంద్రం ఉంది. ఈ చర్యల కారణంగా ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి. కొనుగోలు శక్తి తగ్గుతోంది. వస్తూత్పత్తి పెరుగుతున్నా మార్కెట్ లేకుండా పోతోంది. దీంతో వస్తువుల ధరలు పెరిగి సామాన్యులకు అందుబాటులోకి రాకుండా పోతున్నాయి. అందువల్ల మన పన్నుల విధానాన్ని తక్షణం సమీక్షించాల్సి ఉంది. 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి తగ్గట్లుగా విధానాలు ఉండాలి. నిజానికి యుద్ధాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. తరవాత ఇజ్రాయిల్ యుద్ధం కూడా ఇదే పరిస్థితిలోకి నెట్టింది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిణామాల కారణంగా ధరల దాడి తప్పడం లేదు. ప్రధానంగా ఆయిల్, నూనెల ధరలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పెట్రో,గ్యాస్ ధరలు మున్ముందు మరింతగా పెరిగే అవకాశాలు లేవని చెప్పలేం. మంచినూనెల సరఫరా కూడా దెబ్బ తినే అవకాశం ఉన్నందున ఇప్పటికే పామ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, సోయా నూనె, వనస్పతి ధరలు కూడా పెరగడం మొదలెట్టాయి. మనదేశ చమురు ఉత్పత్తుల వినియోగంలో 85 శాతం దిగుమతులపై ఆధారపడి జరుగుతుంది. కరోనా వలన, ఇతర కారణాల వలన చమురు ఉత్పత్తుల వినియోగం తగ్గింది. కాని పెరిగిన ధరల వలన వాటికి వెచ్చించే మొత్తం మాత్రం పెరిగింది. ధర పెరిగినంత మాత్రాన పెట్రోలు, డీజిల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించలేము. కనుక వాటికోసం మనం వెచ్చించే మొత్తం పెరిగింది. ఐతే కార్మికుల, ఉద్యోగుల వేతనాలు మొత్తం మీద పెరగలేదు. దీంతో మనం ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించి వేస్తున్నాం. ఇతర సరుకుల వినియోగం ఎప్పుడైతే తగ్గిందో, ఆ మేరకు ఆయా రంగాలలో మాంద్యం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. కాని అలా జరగడం లేదు.పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడల్లా వాటిమీద వసూలు చేసే పన్నుల మొత్తం కూడా పెరుగు తోంది. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో ధరల పెరుగుదల వలన అదనపు ఆదాయం సమకూరు తోంది. ఆవిధంగా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఉపాధి కల్పన వంటి రంగాలకు ఖర్చు చేయడం బదులు, కార్పొరేట్లకు మరిన్ని రాయితీల్విడానికో, వారి బకాయిలను మాఫీ చేయడానికో కేంద్రంలోని ప్రభుత్వం వినియోగిస్తోంది. వాస్తవానికి మన దేశంలో పెట్రోలు ధరలో 45.5 శాతం, డీజిల్ ధరలో 39.8 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులకే పోతుంది. పన్ను రూపంలో వసూలు చేసేదానిలో కేంద్రం రాష్ట్రాలతో భాగం పంచుకోవాలి. అందుచేత మోడీ ప్రభుత్వం నేరుగా పన్ను రూపంలో కాకుండా స్పెషల్ డ్యూటీ, రోడ్ సెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ వంటి పేర్లతో వసూలు చేస్తోంది. తరచూ ఆర్థిక మాంద్యం ఏర్పడడం వల్ల సరుకుల వినిమయం తగ్గిపోతుంది. అదే విధంగా ద్రవ్యోల్బణం పెరుగుతూవుంటుంది. మన రూపాయి విలువ పడిపోయినా, సరుకుల ధరలు పెరిగినా అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం 8 శాతం దాటింది. టోకు ధరల సూచి జనవరి 2021తో పోల్చితే జనవరి 2022 నాటికి 13 శాతాన్ని దాటింది. వీటికి తోడు మన దేశ వార్షిక జిడిపి వృద్ధి రేటు ముందు అంచనా వేసినట్టు 9.2 శాతం కాకుండా 8.9 శాతమే ఉండబోతుందని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఒమిక్రాన్, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద ప్రభావం చూపనున్నాయని అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి ఆర్థి దుస్థితికి తాజాఉదాహరణాలు. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. ఐతే మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారులమీదకు నెట్టివేస్తున్నారు. ఇకపోతే పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడం వలన దాని ప్రభావం రవాణా రంగం మీద పడుతుంది. దాని కారణంగా ఇతర సరుకుల ధరలు కూడా పెరుగుతాయి. ఇవన్నీ కలిసి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దీని పర్యవసానంగా శ్రామిక ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోతుంది. దానివలన సరుకుల వినియోగం తగ్గిపోతుంది. మార్కెట్ లోని సరుకులు చెల్లుబాటు కావు. అందువలన ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించాలంటే ప్రజల కొనుగోలుశక్తిని పెంచే మార్గాలు అన్వేషించాలి. ఉపాధికల్పన మార్గాలను అన్వేషించాలి. కనీసం పెట్రో ఉత్పత్తుల మీద పన్నులను పెంచడం తగ్గిస్తే ప్రజల కొనుగోలుశక్తి పెరుగుతుంది. కేంద్ర రాష్ట్రాలు విధిస్తున్న సెస్సులను తగ్గిస్తే అనేక సమస్యలకు సమాధానం లభిస్తుంది. కేంద్రం తీసుకుంటున్న నిరణయాలు ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలే తప్ప దెబ్బతీయరాదు. జిఎస్టీని సమీక్షించకుండా, పెట్రోల్ ధరలపై వ్యాట్ సమీక్షించకుండా ఎంతకాలం సాగించినా దేశం ఆర్థికశక్తిగా ఎదగదని గుర్తించాలి.

# నాల్గవ దశలో ఇండియా కూటమిదే పైచేయి?

- తెలుగురాష్ట్రాలే బిజేపికి దిక్కు?
- గతంలో గెలిచిన 42 సీట్లు నిలబెట్టుకోలేని బిజేపి
- కూటమిలో లేని ప్రాంతీయ పార్టీల మాటనే నెగ్గుతుందా?



(సిహెచ్ వి ప్రభాకర్ రావు)

హైదరాబాద్ మే13 (ప్రజా మంటలు):

నాల్గవ దశ ఎన్నికలు పూర్తయిన తరువాత పోలింగ్ సరళిని పరిశీలించిన విశ్లేషకులు, ఈ దశలో బిజేపికి అనుకున్నన్ని సీట్లు రావడం సాధ్యంకాదనే అంచనాకు వచ్చారు. పది రాష్ట్రాలలో, 96 పార్లమెంట్ స్థానాలలో జరిగిన ఎన్నికల్లో గతంలో 42 స్థానాలను గెలుచుకొన్న బిజేపి, ఈసారి తన సీట్లను నిలుపుకోవడానికి తీవరపయత్నాలే చేసింది. బిజేపి మళ్ళీ అధికారంలోకి రావడానికి స్వంతంగా కానీ ఎన్ డి ఏ కూటమి కూడా, అధికారంలోకి రావడానికి కావాల్సిన 272 సీట్లు రావడామే కష్టమనే వార్తలు వస్తున్నాయి. ఈదశలో ఏ కూటమిలో లేని పార్టీలు గెలిచే సీట్లతో పాటు, తెలుగు రాష్ట్రాలలోని టిడిపి, వై ఎస్ ఆర్ సి పి లతో పాటు, తెలంగాణలో బి ఆర్ ఎస్ గెలిచే సీట్లు కూడా ప్రధానం కానున్నాయి.

ఎప్పుడు బిజేపికి మద్దతు ప్రకటిస్తు, స్వతంత్రంగా వ్యవహరించే ఒరిస్సా లోని బిజూ జనతాదళ్ గత (2019) ఎన్నికల్లో రాష్ట్రంలోని 20 సీట్లలో 12 సీట్లు గెలిచండి. బిజేపి 8 సీట్లు గెలిచింది. ఈసారి బిజూ జనతాదళ్ తొ పొత్తుపెట్టుకోవాలన్న బిజేపి ఆశలు అడియాసలే అయ్యాయి.ఇంతవరకు ఒరిస్సాలో జరిగిన ఎన్నికల్లో బిజేపి ప్రదర్శన అనుకున్నంత గొప్పగా లేదని చెప్పకొంటున్నారు.

బిజేపికి కానీ ఎన్ డి ఏ కి స్వంతంగా అనుకొన్నాన్ని సీట్లు రానపుడు, ఇండియా కూటమికి కూడా అదే పరిస్థితి వచ్చినపుడు, ఏ కూటమిలో లేని ఈ పార్టీలతో పాటు పశ్చిమ బెంగాల్ లో టి ఎం సి గెలిచే స్థానాలు, ఆయా పార్టీలు వ్యవహరించే తీరు దేశ రాజకీయాలను మార్చానున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇందులో వైఎస్ ఆర్ సిపి కాంగ్రెస్ తో కలవడానికి ఆసక్తి చూపకపోవచ్చని, అలాగే టీఎంసీ అధినేత మమతా బెనర్జీ బిజేపిటో జాతకట్టక పోవచ్చు. కానీ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మాత్రం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా మాట మార్చే అవకాశం ఉంది.

ఇప్పటి వరకు పూర్తయిన ఎన్నికల్లో 380 సీట్లలో బిజేపి అనుకూల మైన చోట కూడా కొంత నష్టం జరగనుందనే వార్తలు వస్తున్నాయి. గత 2019 ఎన్నికల్లో బిజేపి, రాజస్తాన్ లోని 25, గుజరాత్ లోని 26 సీట్లు, మధ్యప్రదేశ్ లోని 29 సీట్లలో 28 సీట్లు గెలుచుకోండి. అంటే మొత్తం 80 సీట్లలో 79 సీట్లు గెలుచుకోంది, కానీ ఈసారి ఈ రాజస్తాన్, గుజరాత్ లలో బలమైన రాజ్ పుత్ (క్షత్రీయులు) లు బలంగా బిజేపిని వ్యతిరేకించడం, పార్టీలోని అంతర్గత విభేదాలు పార్టీ అధినాయకత్వాన్ని ఆందోళనకు గురిచేస్తుంది. అలాగే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్లో అధికారం చేజిక్కించుకొన్న బిజేపి, అప్పుడే అంతర్గత విభేదాలతో గతంలో సాధించినాన్ని సీట్లు సాధించకపోవచ్చని తెలుస్తుంది. గతంలో ఈ మూడు రాష్ట్రాలలో 2019 లో గెలుచుకొన్న 79 సీట్లలో కనీసం 20-25 సీట్ల నష్టం జరగవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

దక్షిణాన కర్ణాటక తో పాటు తెలంగాణలో మాత్రమే కొంత ఉనికిని చాటుకొన్న బిజేపి, ఈసారి కూడా తమిళనాడు, కేరళలో ఒక్క సీటు కూడా గెలవలేదనే అనుకొంటున్నారు. అయినా, తమిళనాడు, కేరళలో కనీసం ఒకటి రెండు స్థానలైనా గెలుస్తుందని ఇంకా బిజేపి నమ్ముతోంది. గత ఎన్నికల్లో కర్ణాటకలోని 28 సీట్లలో, 27 సీట్లు గెలుచుకొన్న బిజేపి, ఈసారి అక్కడ అధికారంలో లేకపోవడమే కాకుండా, ప్రజ్వల రెవన్న ఉదంతం రెండవసారి జరిగిన పోలింగ్ పై పెద్ద ప్రభావమే చూపుతుందని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా ఇచ్చిన గ్యారంటీలు నెరవేర్చుతుందనే నమ్మకంతో ఓటర్ల లో కూడా మార్పు వచ్చిందని అనుకొంటున్నారు. ఈ పరిస్థితులలో బిజేపి కర్ణాటకలో కనీసం 10-12 సీట్లు కోల్పోవచ్చని భావిస్తున్నారు.

ఈ పరిస్థితులలో తెలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ తప్ప అన్నీ పార్టీలు అవసరం అయితే బిజేపి తో పెట్టుకోవచ్చని, టిడిపి, బి ఆర్ ఎస్, వి ఎస్ ఆర్ సి పి తమలోని విభేదాలను పక్కన పెట్టి అధికారంలోకి రావడానికి కూడా వెనుకడక పోవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో ఈ పార్టీలు కాంగ్రెస్ కూటమికి కూడా అనుకూలంగా నిర్ణయం తీసుకోవచ్చని, అధికారం కొరకు వీరంతా ఆకలితో ఉన్నారనే విషయం అందరికీ తెలిసిందే. అధికార, ప్రతిపక్ష కూటమీలు రెండు కూడా ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో పూర్తి స్థాయిలో అనుకొన్నాన్ని సీట్లు రాబట్టుకొనే దిశలో లేవని అనుకొంటున్నారు. అలాంటప్పుడు బిజూ జనతాదళ్ తో పాటు, తెలుగు రాష్ట్రాల పార్టీలే కీలకం కానున్నాయి.

ఇక ముందు జరగబోయే మూడు దశల ఎన్నికల్లో 164 సీట్లలో ఎవరెన్ని సీట్లను గెలుచుకొంతరనే దానిపైనే ఏ కూటమి అధికారంలోకి రావడం అన్నది తెలిపోతుంది. పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ లలో గతంలో గెలిచిన సీట్లను నిలుపుకోలేని పార్టీ, హర్యానా, డిల్లీ, పంజాబ్ లలో కూడా గత ఎన్నికల్లో గెలిచిన సీట్లను కూడా కొల్పవనున్నదనే వార్తలు బిజేపి అధినాయకత్వాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. మప్రధాని మోడి అనుకున్నతళులు, హిందూత్వం, ముస్లిం, రామ మందిరం అంశాలు బజని రక్షించలేకపోవచ్చని, కానీ ఎటు కానీ మద్యంతర పార్టీలు కాపాడుతాయన్న ధైర్యంతో బిజేపి-ఆర్ ఎస్ ఎస్ లు కొత్త ప్రణాళికలు రచిస్తున్నాయని ప్రచారం జరుగుతుంది.

# పోలింగ్ ప్రశాంతం



పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 69.81 శాతం, భువనగిరిలో 72.34 శాతం, చేవెళ్లలో 53.15 శాతం, హైదరాబాద్‌లో 39.17 శాతం, కరీంనగర్‌లో 67.67 శాతం, ఖమ్మంలో 70.76 శాతం, మహబూబాబాద్‌లో 68.60 శాతం, మహబూబ్‌నగర్‌లో 68.40 శాతం, మల్కాజ్‌గిరిలో 46.27 శాతం, మెదక్‌లో 71.33 శాతం, నాగర్‌కర్నూల్‌లో 66.53 శాతం, నల్లగొండలో 70.36 శాతం, నిజామాబాద్‌లో 67.96 శాతం, పెద్దపల్లిలో 63.86 శాతం, సికింద్రాబాద్‌లో 42.48 శాతం, వరంగల్‌లో 64.08 శాతం, జహీరాబాద్‌లో 71.91 శాతం పోలింగ్ నమోదైంది. కంటోన్మెంట్ లో 47.88 శాతం - హైదరాబాద్ లో 39 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానంలో సాయంత్రం 5 గంటల వరకూ 47.88 శాతం నమోదైంది. హైదరాబాద్ లో 39 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సాయంత్రం 5 గంటల వరకూ 53.15 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపింది. కామారెడ్డి జిల్లా దోమకొండ ముత్యంపేటలో బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై నిలబడ్డ తమపై ఎస్సై దాడి చేశారని.. నిరసిస్తూ పోలింగ్ బూత్ వద్ద ఇరు పార్టీల కార్యకర్తలు ఆందోళన చేశారు. ఎస్సైపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జగిత్యాల జిల్లాలో ఓ ఓటరు అత్యుత్సాహం ప్రదర్శించాడు. ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో జయరాజ్ అనే వ్యక్తి ఓటు వేస్తూ సెల్ఫీ తీశారు. ఎన్నికల అధికారి ఫిర్యాదు మేరకు సదరు ఓటరుపై కేసు నమోదు చేశారు. కామారెడ్డి జిల్లా పిప్రియాల్ తండాలో సాయంత్రం 3 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచి తండా వాసులు పోలింగ్ బహిష్కరించగా.. అధికారులు నచ్చచెప్పడంతో ఓటు వేసేందుకు సాయంత్రం వచ్చారు. కాగా, సమస్యలు పరిష్కరించలేదని గిరిజనులు ఓటింగ్ బహిష్కరించారు. హైదరాబాద్ పాతబస్తీ మీర్ చౌక్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఒకే రూట్ లో మాధవీలత, ఒవైసీ పోలింగ్ కేంద్రాలు పరిశీలించాన్నారు. రెండు వాహనాలు ఒకే రూట్ లో రావడంతో గందరగోళం నెలకొంది. మాధవీలతను పాతబస్తీ వాసులు అడ్డుకున్నారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు యువకులను అక్కడి నుంచి పంపించేశారు. అయితే, పోలీసుల తీరుపై మాధవీలత ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతబస్తీలో ఎన్నికల సిబ్బంది, కొందరు స్థానిక నేతలు ఇంటింటికీ తిరుగుతూ తలుపులు కొట్టి మరీ ఓటర్లను పిలిచారు. అంతా ఓటు వేసేందుకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్ నగర్ జిల్లా నెల్లికుదురు మండలం హేమ్లతాండా పోలింగ్ బూత్ 160లో బాలకృష్ణ అనే ఓటర్ ఓటు వేసే దృశ్యాలను మొబైల్ లో వీడియో తీశాడు. తన తండ్రి గ్రామ పంచాయతీ సిబ్బంది కావడంతో ఫోన్ తో పోలింగ్ బూత్ లోకి అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో ఓటు వేసిన వీడియోను సదరు ఓటరు సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఈ క్రమంలో ఎన్నికల సిబ్బంది అభ్యంతరం తెలిపారు.

కొడంగల్‌లో ఓటేసిన సిఎం రేవంత్ రెడ్డి

ఉదయం వాతవారణం కొంత ప్రశాంతంగా చల్లగా ఉండడంతో ఓటర్లు వెంటనే బయటకు వచ్చి ఓటేశారు. ప్రముఖులంతా ముందే వచ్చి ఓటేశారు. చింతమడకలో కెసిఆర్, రామ్‌నగర్‌లో దత్తాత్రేయ, జూబ్లీహిల్స్‌లో సినీ ప్రముఖులు, కొడంగల్‌లో సిఎం రేవంత్ రెడ్డి, ఆయా ప్రాంతాల్లో మంత్రులు, అభ్యర్థులు ఓటేశారు. ప్రజలు కూడా గతంతో పోలిస్తే కొంత ఆసక్తిగా ముందుకు వచ్చారు.రాష్ట్ర వ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. మంత్రులు తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కును వినియోగించు కుంటున్నారు. ఖమ్మం జిల్లా మధిరలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పొన్నం ప్రభాకర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు అనేది సామాన్యుల స్వరమని.. పాలకులని ప్రశ్నించేందుకు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని నేతలు సూచించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే మతతత్వానికో, ప్రాంతీయతత్వానికో, కులతత్వానికో, ఇతరాత్ర ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు.



కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిపై సీఈవో వికాస్ రాజ్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ పేరును ప్రస్తావించడంపై కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. పోలింగ్ రోజు వ్యక్తుల పేర్లు ప్రస్తావించడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. కిషన్ రెడ్డిపై ఉల్లంఘన కేసు నమోదు చేయాలని ఈసీని కాంగ్రెస్ కోరింది. కాగా సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ పక్రియ ప్రశాంతంగా జరుగుతోంది.ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు భారీగా చేరుకుంటున్నారు. ఎండలు, వర్షం భయం కారణంగా.. త్వరగా ఓటేస్తే మంచిదని అభిప్రాయపడుతున్న జనాలు.. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే బారులు తీరారు. సినీ, రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పరిధిలో మెగాస్టార్ చిరంజీవి, అల్లూ అర్జున్, ఎన్టీఆర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు దంపతులు, ఇతర ప్రముఖులంతా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్టీఆర్, అల్లూ అర్జున్, చిరంజీవి దంపతులు, డైరెక్టర్ తేజ ఇతర ప్రముఖులు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాని చేరుకుని ఓటు వేశారు. ఇకపోతే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు 50.18 శాతం, నాగర్‌కర్నూల్ పరిధిలో 45.88 శాతం, జహీరాబాద్ పరిధిలో 50.71 శాతం, భువనగిరిలో 46.49, చేవెళ్లలో 34.56 శాతం, హైదరాబాద్‌లో 19.37 శాతం, కరీంనగర్‌లో 45.11 శాతం, ఖమ్మంలో 50.63 శాతం, మహబూబాబాద్‌లో 48.51, మహబూబ్‌నగర్‌లో 45.84 శాతం, మెదక్‌లో 46.72 శాతం, మల్కాజ్‌గిరి పరిధిలో 27.69 శాతం, నల్లగొండలో 48.48 శాతం, నిజామాబాద్‌లో 45.67 శాతం, పెద్దపల్లిలో 44.87 శాతం, సికింద్రాబాద్‌లో 24.91, వరంగల్ పరిధిలో 41.62 శాతం పోలింగ్ నమోదైంది. హైదరాబాద్‌లో 20 శాతం పోలింగ్ నమోదైనట్లు సీఈవో వికాస్ రాజ్ ఉదయం 9గంటల ప్రాంతంలో తెలిపారు. ఓటర్ స్లిప్పులు పరిశీలించడం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని చెప్పారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతపై కేసు నమోదు చేశామని.. సీఎం రేవంత్ పై వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో పోలింగ్ ప్రశాంతంగా సాగుతుందని.. ఒంటిగంట వరకూ రాష్ట్రవ్యాప్తంగా 40 శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలిపారు. కొన్ని నియోజకవర్గాల్లో 50 శాతం ఓటింగ్ నమోదైనట్లు చెప్పారు. హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతపై జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మహిళల బురఖా తొలిగించి పరిశీలించడంపై అభ్యంతరం తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. జనగామలో పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. యువజన కాంగ్రెస్ నేత ప్రశాంత్ రెడ్డి పోలింగ్ సరళి చూసేందుకు రాగా.. బీఆర్ఎస్ ఏజెంట్ అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే పల్లా రజాఏశ్వర రెడ్డి అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు.తెలంగాణలో పోలింగ్ పక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకూ 40 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుటుంబంతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని రామ్ నగర్ లో ఉన్న జీవి హైస్కూల్ పోలింగ్ బూత్ నెంబర్ 234 లో తమ ఓటు వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇక్కడకు వచ్చి ఓటు వేయడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా ముఖ్యమని, ఓటుతో మార్పు తేవచ్చని అన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూర్చాలని కోరారు.

## వందరోజుల పాలనకు

# ఈ ఎన్నికలు రెఫరెండం

సీఎం రేవంత్ ఓటేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అసెప్టెంబర్ 17, 2025తో మోదీ 75 ఏళ్లు నిండుతాయని.. ఏజ్ లిమిట్ అమలు చేస్తే ఎవరు ప్రధాని అనేది బీజేపీ తేల్చుకోవాలని హితవుపలికారు. దేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని స్పష్టం చేశారు. మ్యాజిక్ ఫిగర్ రాకపోతే బీజేపీ, ఎన్డీఏకు దేశంలో మద్దతు ఇవ్వడానికి ఎవరూ సిద్ధంగా లేరని సీఎం వెల్లడించారు. బీజేపీ 336 సీట్లలో మాత్రమే పోటీ చేస్తోందని.. 400 సీట్లు ఎట్లా సాధ్యమని ప్రశ్నించారు. 13 ఏళ్లు సీఎంగా, 10 ఏళ్లు పీఎంగా పని చేసిన మోదీ.. భారత రాజ్యాంగాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదని విమర్శించారు. దేశంలో మతపరమైన రిజర్వేషన్లు లేవన్నారు. సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే దేశంలో రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఏపీలో ఎన్డీఏ కూటమి ఎందుకు చెప్పడంలేదని నిలదీశారు. దేశ ప్రజలకు మోదీ మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు. ఇండియా కూటమి పేరుతో తాము ప్రజలను ఓట్లు అడుగుతోంటే... మోదీ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందన్నారు. ఎవరు నామ్ దార్.. ఎవరు కామ్ దార్ దీన్నిబట్టి తెలుస్తోందన్నారు. ఎవరు అట్టడుగు వర్గాల ప్రజల కోసం పని చేస్తున్నారో చర్చకు సిద్ధమని అన్నారు. దేశంలో మోదీ వ్యతిరేక వేవ్ నడుస్తోందని.. మోదీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడినా చర్యలు లేవన్నారు. నవనీత్ కౌర్ 15 సెకన్ల కామెంట్స్‌పై చర్యలు లేవని మండిపడ్డారు. బీజేపీ నేతలపై ఎంహెచ్ఏ కంప్లైంట్ చేయదని ప్రశ్నించారు. కానీ ఒక వీడియో వైరల్ కేసులో తమపై ఎంహెచ్ఏ రంగంలోకి దిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్యాప్తు ఏజెన్సీలను బీజేపీ దుర్వినియోగం చేస్తుందనడానికి ఇది నిదర్శనమన్నారు. బీజేపీ వాషింగ్ మెషిన్‌లో చేరగానే కొందరు నాయకుల అవినీతి మరకలు తొలగిపోయా? అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ఆదాని, అంబానీ డబ్బులు ఇస్తున్నారన్న మోదీని ఒక్కటే అడుగుతున్నా.. ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులను పంపి ఆదానీ, అంబానీల ఆఫీసులపై, ఇళ్లల్లో సోదాలు నిర్వహించాలన్నారు. మోదీ ఆరోపణలు నిజమైతే ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని అడిగారు. రైతు బంధు ఎలా ఇచ్చామో.. పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ చేసి తీరుతామని మరోసారి స్పష్టం చేశారు. రుణమాఫీ ఏమీ అసాధ్యమైన టాస్క్ కాదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు తమ వంద రోజుల పాలనకు రెఫరెండమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతీసి పెట్టుబడులను గుజరాత్‌కు తరలించుకుపోవాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. యూపీ పరిస్థితిని తెలంగాణలో తీసుకురావాలని ప్రయత్నిస్తోందన్నారు. కేసీఆర్‌పై తనకు సానుభూతి ఉందన్నారు. మానసిక ఒత్తిడితో, నిరాశతో భావోద్వేగంతో ఆయన ప్రకటనలు చేస్తున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కూడా కేఏపాల్ లాగే మాట్లాడుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి సెటైర్ విసిరారు.

## అధికారిమిస్తే మహిళల జీవితాలు మార్చేస్తాం

### - కాంగ్రెస్ గ్యారంటీలతో పేదలకు మేలు

### - వీడియో సందేశంలో సోనియా గాంధీ

దిల్లీ(ప్రజా మంటలు):

తమ మ్యానిఫెస్టోలో పేర్కొన్న గ్యారంటీలతో దేశంలో మహిళల స్థితిగతులు పూర్తిగా మారిపోతాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తెలిపారు. దేశంలో నెలకొన్న తీవ్ర సంక్షోభం వల్ల మహిళలు గడ్డుకాలం ఎదుర్కొంటున్నారని సోమవారం విడుదల చేసిన వీడియో సందేశంలో అన్నారు. అలాంటి వారందరికీ కాంగ్రెస్ హామీ ఇచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల లబ్ధి చేకూరుతుందని తెలిపారు."స్వాతంత్ర్య సంగ్రామం మొదలుకొని నేటి ఆధునిక భారత నిర్మాణం వరకు మహిళల కృషి మరువలేనిది. కానీ, ద్రవ్యోల్బణం వల్ల నేడు వారు తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నారు. వారి కష్టానికి న్యాయం చేకూర్చేందుకు కాంగ్రెస్ విప్లవాత్మక గ్యారంటీతో ముందుకొచ్చింది. మహాలక్ష్మి పథకంతో ప్రతి పేద మహిళకు సంవత్సరానికి రూ.1 లక్ష లభిస్తాయి" అని సోనియా గాంధీ హామీ ఇచ్చారు.తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఇప్పటికే తాము అమలు చేస్తున్న గ్యారంటీల వల్ల అనేక కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని సోనియా పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు, ఆహార భద్రత వంటి విప్లవాత్మక చర్యల ద్వారా కోట్లాది మంది భారతీయులకు కాంగ్రెస్ పార్టీ సాధికారత కల్పించిందన్నారు. మహాలక్ష్మి ద్వారా దాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.సోనియా గాంధీ వీడియో సందేశాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు పార్టీ నేతలు తమ 'ఎక్స్' ఖాతాల్లో పోస్ట్ చేశారు. ఒక్క ఓటు విలువ సంవత్సరానికి రూ.లక్షతో సమానమని సోనియా సందేశాన్ని షేర్ చేస్తూ రాహుల్ గాంధీ అన్నారు. "నిరుద్యోగం, ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న మహిళలకు కాంగ్రెస్ మహాలక్ష్మి పథకం సంజీవనిలా పనిచేయనుంది. ప్రతినెలా ఖాతాల్లో రూ.8,500 జమ అయితే ఆర్థికంగా ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. మీ కుటుంబ భవిష్యత్తును మీరే నిర్దేశించగలరు" అని రాహుల్ రాసుకొచ్చారు.

## కేజ్రీవాల్ గ్యారెంటీలు సరికాదు

### - 22 సీట్లలో పోటీ చేస్తూ.. దేశం మొత్తానికి హామీలు ఎలా ఇస్తారు?

### - ఆప్‌ను ఎద్దేవా చేసిన అమిత్‌షా

దిల్లీ(ప్రజా మంటలు):



ఆప్ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రకటించిన 10 గ్యారెంటీలను దేశ హోం మంత్రి అమిత్‌షా తప్పు పట్టారు. అసలు ఆ పార్టీ 22 సీట్లలో మాత్రమే పోటీ చేస్తూ దేశం మొత్తానికి హామీలు ఇస్తోందని ఎద్దేవా చేశారు. ఓ ఆంగ్లపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఆప్ ఎన్ని సీట్లలో పోటీ చేస్తోంది? 22 చోట్ల. మీకు ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి పార్లమెంట్‌లో మెజార్టీ అవసరం. 22 చోట్ల పోటీ చేస్తూ.. దేశం మొత్తం కరెంటు బిల్లులు రద్దు చేస్తామని చెబుతున్నారు" అని వ్యాఖ్యానించారు.ముందు కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వలేదని.. తాత్కాలిక ఉపశమనం మాత్రమే కల్పించారని అమిత్‌షా పేర్కొన్నారు. "ఆయన తన అరెస్టే తప్పు అని తొలుత కోర్టులో పిటిషన్ వేశారు. దానిని సుప్రీంకోర్టు అంగీకరించలేదు. దీంతో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దానిని కోర్టు ఒప్పుకోలేదు. చేసేది లేక.. ప్రచారానికి అనుమతి కోరారు. కొన్ని నిబంధనలతో జూన్ 1 వరకు అనుమతి ఇచ్చింది. ఆయన 2వ తేదీన తిహాడ్ జైలుకు వెళ్లాలి. ఇది అతడికి అనుకూలంగా ఎలా ఉపయోగపడుతుంది" అని ప్రశ్నించారు. మోదీ వయసుపై కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని షా తెలిపారు. 2029 వరకు మోదీనే ప్రధానిగా కొనసాగుతారని పునరుద్ఘాటించారు. ఈసారి ఎన్నికల్లో భాజపా 370కి పైగా, ఎన్డీఏ కూటమి 400కు పైగా సీట్లను సాధిస్తుందని అమిత్‌షా జోస్యం చెప్పారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణల్లో భారీ విజయాలు సాధించనున్నామన్నారు. గత నెలలో కూడా షా ఇటువంటి వ్యాఖ్యలే చేశారు.దేశవ్యాప్తంగా 24 గంటల విద్యుత్తు, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యంతోపాటు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పించనున్నట్లు కేజ్రీవాల్ ప్రకటించారు. అగ్నివీర్ పథకం రద్దుతోపాటు స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించనున్నట్లు హామీ ఇచ్చారు.

## సహజమైనది చెడగొట్టద్దు"



అనంతారం ఊరులో తిరుపతి రైతు ఉన్నాడు. అతని భార్య పద్మ . వీరికి ఇద్దరు పిల్లలు.వీరు పాఠశాలకు వెళుతున్నారు. అవని మూడవ తరగతి,అవదూత్ నాలుగవ తరగతి .తిరుపతికి రెండు ఎకరాల పొలం ఉంది. ప్రతి సంవత్సరం సాగు చేసి రెండు పంటలు తీస్తున్నాడు. తన పొలం పక్కన ఒర్రె పారుతుంది .తిరుపతి పొలం పక్కన రాములు పొలం ఉంది.ఇద్దరు మంచి మిత్రులు.అయితే ఒక్కసారి తిరుపతికి దురాశపుట్టింది. ఒర్రెను చదును చేయాలని తలిచాడు. తన పొలంలో కలిసితే పావు ఎకరం కలుస్తుందని అతి ఆశ పడ్డాడు. రాములు ఒర్రెను తీసేస్తే మనకు ప్రమాదం వద్దంటాడు. తిరుపతి వినడు. ఒర్రెను చదునుచేసి పొలంలో కలిపాడు.స్థలం కలిసింది అని సంతోషించాడు. రాములుమాత్రం సహజత్వంను దెబ్బతీయకూడదనీ మొరమొర మొత్తుకున్నాడు. ఒర్రెలు,కుంటలు, గుట్టలు తీస్తే నష్టపోతాము అని తెలిపాడు. ప్రకృతి సహజత్వానికి నష్టంచేస్తే ప్రకృతి మనకు నష్టం చేస్తుందంటాడు.తిరుపతి వినలేదు . రాములు బాధపడ్డాడు.వానకాలంలో వరద వచ్చింది. బురదమట్టి పొలం అంతా మేటవేసింది. రెండు ఎకరాల వరిపొలం నాశనమయింది. అయ్యో రాములు చెప్పిన వినకపోతిని కదా అనుకుంటూ తిరుపతి నెత్తి నోరు బాదుకొని ఏడ్చాడు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి పంట పండించాను. అప్పులు తెచ్చి చదును చేశాను. అనుకుంటూ కన్నీళ్లు పెడుతాడు.భార్య పద్మ ఏడుస్తుంది. వీరిరువురిని రాములు ఏడ్వకండనీ ఓదార్చుతాడు. నేను చెప్పినా వినలేదంటాడు .మట్టి తీసి యదావిధిగా ఒర్రెను పెట్టాలని సూచించాడు. "దురాశ దుఃఖానికి చేటు "అంటాడు. రాములు పైసలు సహాయం చేయగా తిరుపతి ఒర్రెను ఎప్పటోలే చేస్తాడు. మంచి మాటలు ఎవరు చెప్పినా వినాలనీ భార్యా పిల్లలతో అంటాడు. అప్పుడే రాములు చెప్పిన మాటలు వింటే ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదంటాడు. అప్పటినుండి తిరుపతి చక్కగా పంటలు పండించి అప్పులు తీర్చుతాడు. భార్య పిల్లలతో ఆనందంగా జీవిస్తాడు.

**- డా.వాసరవేణి పరశురాం, బాలసాహిత్య రచయిత,**
**సింగారం, రాజన్న సిరిసిల్ల**




## అంతిమ తీర్పు!!

తూరుపు తెలిరేకలు విచ్చుకోగానే
పోలింగ్ పోరుకి విద్యాలయాలు
వళ్ళు విర్చుకొని వేదికలై నిలిచి
అందరికీ ఆహ్వానమన్నాయి..
మెల్లగా కదిలింది జన ప్రభంజనం
తళుక్కున మెరిసింది ప్రజాస్వామ్యం
గుండెల్లో మురిసింది మువ్వన్నెల జెండా
చూపుడు వేలిపై కత్తులు మొలిచే
యుద్ధం మొదలైంది..
నెత్తురు చిందని ప్రజాస్వామ్య పరాక్రమం
విక్రమించి నవోదయానికి నాంది అంది
పోలింగ్ బూత్ లు యుద్ధ శిబిరాలైన వేళ
సుశిక్షితులైన సైనికుల్లా జనం ఓట్లేసి
ప్రజాస్వామ్యాన్ని గెలిపించడానికి తరలి
వస్తున్నారు..
ఈవీఎంలు బీప్ బీప్
మంటూ జయపజయాల
త్రాసుల్లా ఊగిస లాడుతున్నాయ్!
ఈ ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామ్య
దేశంలో ప్రజలు నిస్వార్థపరులు
ఎప్పుడూ కాలానికి తగ్గ నాయకుల్నే
ఎన్నుకుని దేశాన్ని అరచేతులపై
ముందుకు నడిపించే సహృదయులు
చిన్న చిన్న తాయిలాలకి తాత్కాలికంగా
ఆశపడ్డా, శాశ్వతమైన దేశం కోసం
ఎప్పుడూ ముందు నిలబడి పోరాడిన
గతమెంతో ఘనచరిత్ర కలిగినోళ్లు..!
వారి విచక్షణా శక్తి వితరణ శీలతే
ఏ తారతమ్యాలు, తరతమ భేదాలు
లేని శక్తివంతమైన నవభారతాన్ని
ఈవీఎంల్లోంచి తప్పక సృష్టిస్తుంది..!!

భీమవరపు పురుషోత్తమ్
రాజమండ్రీ, 9949800253



## ముప్ఫై విద్యలు

వీణవంక అనే గ్రామానికి దగ్గరగా ఉన్న చిట్టడవి పక్కగా నడచుకుని వెళుతోంది మార్జాలం అనే గండుపిల్లి. అప్పుడే అడవిలోనుండి జంబూకం అనే నక్క నడుస్తున్న పిల్లిని చూసి " ఇది ఇక్కడికి ఎందుకొచ్చిందబ్బా చూస్తే మంచి పుష్టికరంగా ఉంది దీనిని మచ్చిక చేసుకుని తినేస్తే బాగుంటుంది కదా!" అనే దుష్ట ఆలోచన చేసింది.

"పిల్లి మామా ఇక్కడకెందుకొచ్చావు నీవు ఊర్లో ఇళ్ళలో తిరుగుతుంటావు కదా అడవికి దగ్గరగా వచ్చావు తోడేలు చూసిందంటే నిన్ను మింగేస్తుంది. తోడేలులాటి క్రూర జంతువులనుండి తప్పించుకోవాలంటే నీకు ఏ విద్యలు వచ్చు?"అని సౌమ్యంగా అడిగింది.

"నీ పేరు ఏమిటి? నాపేరు మార్జాలం నాకు వేగంగాపరుగెత్తే విద్య వచ్చు ఎలక ఎక్కడుందో పసిగట్టి పట్టి తినే విద్యవచ్చు.మనుషులు తాగే పాలు తినే పెరుగు దొంగతనంగా తినడం వచ్చు" గర్వంగా చెప్పింది మార్జాలం. "నాపేరు జంబూకం నాకైతే ముప్ఫైవిద్యలు వచ్చు వాటిని నీకు నేర్పిస్తాను భయంలేకుండా బాగా బతకవచ్చు"అని వింతగా కళ్ళుపెట్టి చెప్పింది. "నేర్చుకుంటా" అని అమాయకంగా చెప్పింది మార్జాలం. ఇంతలో మేకలు మేపే ఒక వ్యక్తి కర్రపట్టుకుని వస్తున్నాడు.వాడికి జంబూకం లాటి నక్కలు జిత్తులమారివని తెలుసు వెంటే కర్ర ఎత్తి వేగంగా వచ్చి జంబూకం మీద గట్టిగా ఒక్క దెబ్బ వేసాడు. జంబూకం బాధతో "కుయ్యోమొర్రో" అని అరుస్తూ అడవిలోకి వెళ్ళేందుకు ప్రయత్నించ సాగింది.

మార్జాలం మటుకు గబుక్కున ఓ చెట్టు ఎక్కి,చెట్టు పైనుండి "జంబూకం అల్లుడూ నీ ముప్ఫైవిద్యలతో పాటు చెట్టు ఎక్కడం కూడా నేర్చుకో బతికిపోతావు" అని చిరు నవ్వుతో చెప్పింది మార్జాలం.

**"నిజమేకదా!" అనుకుంటూ అడవిలోకి తుర్రుమన్నది జంబూకం.**

**కంచనపల్లి వేంకట కృష్ణారావు**
**హైదరాబాద్, 9348611445**

## ముక్తిమార్గం ..చార్‌దామ్ యాత్ర

న్యూఢిల్లీ,మే13 (ప్రజామంటలు): మనదేశంలోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలో గల గంగోత్రి, యమునోత్రి, కేదారనాథ్, బద్రీనాథ్‌లను కలిపి చార్ ధామ్ అని పిలుస్తారు. ఈ ఏడాది మే10 అక్షయ తృతీయ రోజున చార్‌ధామ్ యాత్ర మొదలైంది. లక్షలాదిమంది హిందువులు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. చార్‌ధామ్ యాత్ర చేసిన వారికి జననమరణ చక్రభ్రమణం నుంచి విముక్తి దొరకుతుందని నమ్మకం. కేదార్ నాథ్ జ్యోతిర్లింగ దర్శనం తర్వాత స్వామివారి అభిషేక జలం స్వీకరించిన భక్తులకు తప్పక మోక్షం సంప్రాప్తిస్తుందని చెప్తారు. బద్రీనాథ్ దామ్ సందర్శన చేసిన వారు తిరిగి గర్భప్రవేశం చెయ్యడని, ముక్తిని పొందుతాడని శాస్త్రం చెబుతోంది. చార్‌ధామ్ ప్రయాణం వెనుకున్న కారణాలు, ఈ యాత్ర ప్రాశస్త్యం కారణంగా ప్రజలు చార్‌ధామ్ యాత్రకు ఆసక్తి చూపుతారు. ఈ యాత్ర చేయడం వల్ల జీవితానికి ఎన్నో ఆధ్యాత్మిక ప్రయోజనాలు లభిస్తాయని ప్రశస్తి. పరమాత్ముడితో అనుసంధానం చేసే యాత్రే చార్‌ధామ్ యాత్ర. తీర్థయాత్ర చేసే సంకల్పం చేశారంటేనే ఎక్కడో సాత్వికత ఉందని అర్థం. చార్ ధామ్ ఒక సుదీర్ఘ తీర్థయాత్ర. ఈ యాత్ర ఆసాంతం మనసు ఒక పవిత్ర భావనతో ఉంటుంది. ఫలితంగా సానుకూల శక్తులను ఆకర్షించగలుగుతారు. ఈ యాత్ర జీవిత లక్ష్యాలను అర్థం చేసుకోవడంలో మీకు ఎంతో తోడ్పడుతుంది. నిజానికి ఈ యాత్ర జీవన యానానికి ఒక మార్గదర్శనం వంటిది. చార్‌ధామ్ యాత్ర చేసిన వారికి జన్మజన్మలుగా వెంటాడుతున్న పాపాలు ప్రక్షాళన అవుతాయని విశ్వాసం. తెలిసీ తెలియక చేసిన అన్ని తప్పులకు ఈ యాత్ర ద్వారా మన్నింపు దొరుకుతుందని నమ్మకం. చార్ ధామ్ యాత్ర చేసి వచ్చిన వారు మరింత జాగరూకతతో ఇక జీవితంలో పాపాలు చెయ్యకుండా జీవించాల్సి ఉంటుందని నమ్ముతారు. చార్‌ధామ్ లో కేవలం దైవదర్శనం మాత్రమే కాదు, ప్రకృతిలో లీనమైన భగవద్దర్శనం జరుగుతుంది. గంగోత్రి, యమునోత్రి, కేదార్ నాథ్, బద్రీనాథ్ లలోని ప్రకృతి అందాలు ఒక అద్భుతమైన అనుభూతి ఇస్తుంది. చార్‌ధామ్ యాత్ర శరీరానికి అరోగ్యాన్ని ప్రసాధిస్తుంది. ఆయుశ్శును పెంచుతుంది. చార్‌ధామ్ యాత్ర చాలా కష్టాలకోర్చి చెయ్యవలసిన యాత్ర. ఇక్కడి వాతావరణం చాలా స్వచ్ఛంగా ఉంటుంది. పర్యావరణం కాలుష్యరహితంగా ఉంటుంది. భక్తి మనసును శుద్ధి చేస్తే అక్కడి పర్యావరణం నీళ్లు శరీరాన్ని శుద్ధి చేస్తుంది.హిందూ సంస్కృతిపై అవగాహన కోసం చాలా మంది విదేశీయులు ఈ యాత్ర కోసం మనదేశానికి వస్తుంటారు. అక్కడి ప్రజల జీవన విధానం, వారు ధరించే దుస్తులు, ఇతర నమ్మకాల గురించి తెలుసుకుంటారు. అక్కడి సమాజానికి దగ్గరగా మసలడం ద్వారా, సంస్కృతిని ఆకళింపు చేసుకోవడం ద్వారా సహజంగానే ప్రవర్తనలో పరివర్తనను స్వయంగా గుర్తించవచ్చు. ఈ పరివర్తన మన జీవితంలో గొప్ప మార్పుకు కారణం అవుతుంది.


## విజయనగర సామ్రాజ్య స్థాపకుడు విద్యారణ్యుడు"

### వైశాఖ శుక్ల సప్తమి ... విజయనగర రాజ్య స్థాపన దినం - వైశాఖ శుక్ల సప్తమి విద్యారణ్య స్వామి జయంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

"సదాశివ సమారంభం శంకరాచార్య మధ్యమాం అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం"...
"అవిద్యారణ్య కాంతారే భ్రమతం ప్రాణినాం సదా, విద్యా మార్గోపదేష్టారం విద్యారణ్య గురుం శ్రయే"...
"విద్యా విద్యావివేకీన పారం, సంసార వారిధే: ప్రాపయత్య నిశం భక్తాన్ తం విద్యారణ్యమాశ్రయే...




ఆదిశంకరుని అనంతరం అంతటి వారిగా పేరెన్నికగన్నారు విద్యారణ్యస్వామి. విఖ్యాత పురుషుడు, మహాయోగి, మహామతి, కవి, తాత్వికుడు, ద్రష్ట, వేదత్రయ భాష్య కర్త, బ్రహ్మవిద్య పారంగతుడు, శ్రౌత స్మార్త క్రియా పరుడు, వేదాంత శాస్త్ర ఆది రచయిత, శతాధిక గ్రంథకర్త, విశేషించి విజయనగర మహా హిందూ సామ్రాజ్య నిర్మాత, రాజ్య స్థాపకుడు, మహామంత్రి, హిందూ మతోద్ధారకుడు, విరూపాక్ష పీఠ స్థాపకుడు, శృంగగిరి పీఠాధిపతిగా పలు విధ ప్రత్యేకతలు లతో , జగత్ ప్రసిద్ధి పొందారు విద్యారణ్యస్వామి.

1267 లో వైశాఖ శుక్ల సప్తమి నాడు జన్మించి, 1331 లో సన్యాసం స్వీకరించి, శృంగేరి పీఠాధిపత్యం వహించారు. 1386 లో శుద్ధ త్రయోదశి నాడు సిద్ధి పొందారు విద్యారణ్యులు. విద్యారణ్య స్థాపిత పుష్పగిరి తదితర స్థలాలలో, జ్యేష్ఠ శుక్ల త్రయోదశి నాడు, ఆరాధనోత్సవాలు సాంప్రదాయ రీతిలో నిర్వహిస్తారు.

ఉత్తర హిందూ దేశమంతా మహమ్మదీయుల వశమై, అన్యమతస్తుల ఆధిపత్యం అధికమైన పరిస్థితులలో, శంకరుని తర్వాత అంతటి వాడైన, ప్రాధాన్యత కలిగిన విద్యారణ్యుడు విద్యానగరం (విజయనగర) సామ్రాజ్య నిర్మాత సామ్రాజ్య రక్షకులు అయినారు. భరత జాతిని జాగృతపరిచే చేందుకు అహరహం శ్రమించి, విశేష కృషి సల్పి లక్ష్యసాధనలో సిద్ధి పొందారు. ముస్లిం మతం బలవంతంగా పుచ్చుకొన ఇష్టపడని స్థితిలో, తిరిగి హిందూ మతంలోకి రావాలనుకునే వారికి, కల్పవృక్షమై నిలిచారాయన.

1331లో ప్రజోత్పత్తి సంవత్సర కార్తీక శుద్ధ సప్తమి నాడు శృంగేరి పీఠాధిపత్యం వహించారు.

తమకు ముందున్న శృంగేరి పీఠాధిపతులు, విద్యా తీర్థుల అనుమతితో శృంగేరి పీఠానికి అనుబంధంగా విరూపాక్ష, పుష్పగిరి, శివగంగ, ఆమని సంకేశ్వర్, కొల్లాపురంలలో స్థాపనలు గావించి, తద్వారా హిందూమత దీక్షలు ఇప్పించి, అన్య మతాల బాధితులకు ఆశ్రయ దాత అయినారు. "పరాశర మాధవీయం" అనే స్మృతి గంథంలో తమ గూర్చి చెప్పుకున్నారు. శ్రీమతి మాయణునిల తనయుడై, సాయన, సోమ నాథుడు ఇరువురు సోదరులు, సింగల సోదరిని కలిగి, కృష్ణ యజుర్వేది, బోధాయన సూత్రుడు, భారద్వాజ సగోత్రుడు, మాధవ జన్మనామం కలిగి, సన్యాసి నుంచి "విద్యారణ్య" నామధేయులైన స్వామి, బాల్యమున విద్యాభ్యాసం నాటికి దక్షిణ భారతంలో ఆర్ష పరిస్థితి శోచనీయమై, వేదశాస్త్రాలు అడుగంటి, శ్రౌతస్మార్త విద్యలు భ్రష్ట మై, ఉపనిషన్మతం పెడత్రోవలో పడి, మతం పలు శాఖలుగా చీలిన పరిస్థితులలో, విద్యారణ్యుడు అవతరించి వేద మతాన్ని ఉద్ధరించారు. మత త్రయాచార్యులు, వేదాంత శాస్త్రాలను మాత్రమే విస్తరింప చేయగా, వేదార్థ విశదీకరణ కానరాని స్థితిలో, గాయత్రీ మంత్రోపాసకుడై, భువనేశ్వరి మాత ప్రత్యక్ష ప్రసన్నతో, హరిహర బుక్కరాయలచే రాజ్యస్థాపన గావించి, 1350-13 ఏళ్ల మధ్య కొంత కాలము మంత్రిగా ఉండి, 1400 గ్రంథాలు రచించి 1380 లో శృంగేరి పీఠాధిపతులై లౌకిక, వైదికాంశములలో, అసమాన ప్రతిభులై, మత, రాజ్యోద్ధరణ గావించినట్లు, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. సర్వజ్ఞ విష్ణు అనే గురువు వద్ద లేదా వేదాంత శాస్త్రాలు ఆయన అభ్యసించినట్లు సర్వదర్శనం సంగ్రహంలో ఉంది. బ్రహ్మచర్యాశ్రమం నుండి మాధవుడు సన్యసించినట్లు చెబుతారు కానీ చాళుక్య చక్రవర్తి మంత్రి అయిన వీతి హోత్రుని కుమార్తె వీతి హోత్రి అను కన్యను తల్లిదండ్రుల ఆజ్ఞానుసారం పెండ్లి చేసుకుని కొంతకాలం సంసారం సాగరమున ఉన్ననూ, బ్రహ్మచర్య నిష్ఠా గరిష్టుడు అగుటచే యవ్వన వంతులుగా ప్రకాశించి నట్లు పురాణపండ రామ్మూర్తి పేర్కొన్నారు. అన్యమతస్తుల ఆగడాలు కలత పెట్టగా, మాధవుడు తుంగభద్ర తీరాన భువనేశ్వరి అమ్మవారిని గురించి గాయత్రి మంత్రంతో తీవ్ర తపస్సు ప్రారంభించగా అమ్మవారు ప్రత్యక్షమైన వేళ... ఆయన ఐశ్వర్యం కావాలని కోరుకోగా, అందుకు ఆయనకు అర్హత లేదని, అమ్మ వారు చెప్పిన ప్రకారం సన్యసించి శృంగేరి పీఠాధిపత్యాన్ని వహించగా, అప్పుడు, ఆ జగజ్జనని మూడు గడియల సేపు సువర్ణ వృష్టి కురిపించినట్లు కథనాలు. భువనేశ్వరి మాత అనుగ్రహించిన అపార సంపత్తిని విరూపాక్ష పీఠం నెలకొల్పడానికి, విద్యా నగరాన్ని పెంపొందించడానికి, విజయనగర సామ్రాజ్యాన్ని విస్తరింపచేయడానికి ఉపయోగించారు.

### "ధర్మపురి తో విద్యారణ్యుల అనుబంధం"

1936లో విజయనగర సామ్రాజ్య రాజధాని విజయనగరాన్ని నిర్మించి, శృంగేరి పీఠం అధిష్టించిన పవిత్రాత్ములకు, ధర్మపురి క్షేత్రంతో విడదీయాలని సంబంధం, అనుబంధం ఉన్నాయి. ప్రాచీన ఆర్ష విద్యా, సంస్కృతులకు కేంద్ర స్థానం అయి, వేద విద్యకు కాణాచియై, చరిత్రకందని అంత పూర్వ కాలికంగా, ఉజ్వల సాంస్కృతిక వైదిక పౌరాణిక పుణ్యస్థలమై, పవిత్ర గోదావరి తీర క్షేత్రమైన ధర్మపురితో, ఆయనకు అత్యంత సాన్నిహిత్యం ఉంది. ఈ నేపథ్యంలోనే శాలివాహన శకం 1258 (క్రీస్తుశకం 1336) ధాత్రు నామ సంవత్సర వైశాఖ శుక్లపక్ష సప్తమి పుష్యమి నక్షత్ర సింహ లగ్నం సుముహూర్తాన, "విజయనగర సామ్రాజ్య స్థాపన" సమయాన ధర్మపురికి చెందిన, చతుర్వేద పండితులను, ఆహ్వానించినట్లు చెప్పబడుతున్నది పింగళి సూరన "కళా పూర్ణోదయం"లో చతుర్వేదాలు, బ్రాహ్మణ కుమారులుగా, ధర్మపురిలో జన్మించినట్లు గాధ నిర్మించారు. చతుర్వేదాలు ప్రభవించడానికి, యోగ్యమైన క్షేత్రంగా ధర్మపురి సూరన భావించాడు. అంతేగాక ధర్మపురికి, విజయనగర రాజ్యానికి, దగ్గర సంబంధం ఉన్నట్లు, చారిత్రక పరిశోధకులు, బహు గ్రంథ కర్త, డాక్టర్ సంగనభట్ల నరసయ్య ఈ విషయంలో విశేష కృషి సలిపారు. ధర్మపురి లోని యోగ నరసింహుడు విజయనగరంలోనూ ఆరాధ నీయుడైనాడు. ధర్మపురి లోని 60 స్తంభాల గుడిని పోలిన వంద స్తంభాల విఠలాలయం హంపిలో ఉంది. హంపీలోని తుంగభద్ర నదిలో కోదండ రామాలయానికి ఎదురుగా ఉన్న చక్రతీర్థం, గోదావరిలోని చక్రతీర్థం పోలి ఉంది. ధర్మపురి లాంటి కళ్యాణ డోలోత్సవ మంటపాలు, విఠలేశ్వర మందిరం అందులోనూ ఉన్నాయి. కృష్ణ దేవరాయల సోదరుడు వీర నరసింహ రాయలు ఉదయమే, నూటొక్క దివ్య క్షేత్రాలు ప్రసాదం తీసుకొనిదే, రాయ సింహాసనం అధిరోహించే వారు కాదట. అలా నూటొక్క దివ్య తిరుపతిలలో ఒకటిగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా ధర్మపురి ప్రసిద్ధమైనది. ధర్మపురి క్షేత్రంలో వీధి వీధికి శివలింగం, నంది, పార్వతి, గణపతి, ఆంజనేయులుతో కూడిన "శివ పంచాయతనాలు" అనబడే గ్రామ రక్షక దేవతల గద్దెలు ఉన్నాయి. ఇలాంటివే శృంగేరి లోనూ ఉన్న నేపథ్యంలో, ధర్మపురి ప్రాంత ప్రభావితుడైన విద్యారణ్యుల ద్వారానే ఈ సాంప్రదాయం ప్రబలినట్లు చెబుతారు. దక్షిణామ్నాయ శృంగేరి పీఠం 12వ అధిపతి అయిన విద్యారణ్యులు, ధర్మపురి లో నివసించి, వేదాధ్యయనం చేసినట్లు, విజయనగర రాజ్య స్థాపకుడు హక్క, బుక్క సోదరులలో జ్యేష్ఠుని పట్టాభిషిక్తుడిని చేసి "హరిహర రాయలు" అని నామమిడినట్లు, ఇది హరి హర క్షేత్ర మైన ధర్మపురి ప్రభావ ఫలితమేనని, హరిహర అభేదమైన నరసింహునికి, శివునికి సమాన పూజలు, అనాదిగా జరుగుతూ, బ్రహ్మ, శివ అంశలతో జన్మించిన ఆంజనేయుని, గణపతి విగ్రహాలు నరసింహ ఆలయంలో కలిగి, శివకేశవ అభేద తత్వాన్ని చాటుతూ, స్మార్త ఆగమ పూజ రీతులతో, శైవ వైష్ణవ ఆగమ విధానాలతో, ఉభయ దేవతలు ఉపాస్యులుగా, ఆచరించే సత్సంప్రదాయం, విద్యారణ్యుల పై తీవ్ర ప్రభావం చూపినట్లు, అది యావత్ భారతానికి ఆదర్శ ప్రాయమైనట్లు భావించ డానికి ఆధారాలు ఊతమిస్తున్నాయి.

## ఎన్నికల సంస్కరణలు తక్షణావశ్యకం !

దేశవ్యాప్తంగా నాలుగోవిడత ఎన్నికలు ఉత్సాహంగా సాగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎన్నికలతో పాటు, ఎపిలో అసెంబ్లీ ఎన్నికలకు ఓటేసేందుకు ప్రజలు బారులు తీరారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రజలు ఓటసేందుకు సొంతూళ్లకు వెళ్లడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చెప్పుకోవాలి. అయినా ఓటర్లు ఇంకా ఇల్లు విడిచి బయటకు రావాడానికి వెనకాడడం సహించరాని నేరంగా పరిగణించాలి. ఓటర్లు అంతా నూటికినూరు శాతం కాకున్నా కనీసం 90శాతం మంది ఓటేస్తేనే ప్రజల పూర్తి అభిప్రాయం తెలుస్తుంది. ఇందుకోసం కఠిన చట్టాలను తీసుకుని రావాలి. ఓటేయడం ఖచ్చితం చేయాల్సిన ఆగత్యం వరుస ఎన్నికల్లో ఓటింగ్ శాతాలను బ్టటి తెలుస్తోంది. ఇప్పటికే మూడు దశల్లో ఎన్నికలు ముగిసాయి. ఈ ఎన్నికల్లో కూడా 70శాతం పోలింగ్ కూడా నమోదు కాలేదు. నాలుగో విడత కూడా మందకొడిగానే పూర్తి కావచ్చింది. ప్రజలు ఎవరికి అధికారం కట్టబెట్టాలో తీర్పునిచ్చారు. మరో మూడు విడుతల్లో జూన్ 1 వరకు ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఫలితాలు వెల్లడితో ఎవరు అధికారంలోకి రాబోతున్నారో తేలనుంది. ఈ మూడు విడతల్లో అయినా మరింత ఉత్సాహంగా ఓటేసేలా ప్రజలు ముందుకు రావాలి. ఇకపోతే ఎన్నికల చట్టంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఇన్నేళ్లుగా వస్తున్న ఓట్ల పండగలను బట్టి గమనించవచ్చు. ప్రధానంగా పటిష్టమైన ఓటురాకార్డు..పర్మినెంట్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలి. మనిషి మరణించే వారకు ఓటును ఆధార్, పాన్‌లాగా దాచుకునేలా పటిష్టం చేయాలి. అలాగే ఓటు వేయడం అన్నది విధిగా చేయాలి. ఇంట్లో కూర్చుని ఓటేయక పోవడాన్ని నేరంగా పరిగణించాలి. ఈ రెండూ చేస్తే కొంత మార్పు రావచ్చు. ఇకపోతే రాజకీయ పార్టీల ప్రలోభాలను అరికట్టాలి. డబ్బుల పంపిణీ, గిఫ్టుల పంపిణీ చేస్తే పార్టీల గుర్తు రద్దు చేసేలా చేయాలి. అట్టహాసంగా సభలు పెట్టే దానిని కూడా నియంత్రించాలి. సోషల్ మీడియా, టివి రంగం అందుబాటులోకి వచ్చింది కనుక ప్రచారం పరిమితం చేయాలి. జనాలను అదేపనిగా లక్షల సంఖ్యలో తరలించి భారీ బహిరంగ సభలను నిర్వహించే పద్దతిని నిర్మూలించగలగాలి. ఎన్నికలను రాజకీయ పార్టీలు ఖరీదైనవిగా చేస్తూ పోతున్నాయి. సామాన్యులు పోటీ చేయకుండా అడ్డుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరస్థులు, గుండాలు, డబ్బున్న వారు మాత్రమే పోటీ చేయగలుగుతున్నారు. ఇకపోతే జనాభా నియంత్రణ కూడా ఇందులో జోడించాలి. అత్యధిక మందిని కంటున్న వారిపై ఆంక్షలు పెట్టాలి. అలాంటివారు పోటీచేయకుండా, ఓటేయకుండా చేయాలి. ఎన్నికల సంస్కరణలపై కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వం చర్చించాలి. పటిష్టమైన ఎన్నికల విధానం రావాలి. అలా వచ్చిన తరవాత ఎన్నికైన వారు ప్రజాస్వామ్య బద్దంగా నడుచుకునేలా మన వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఈ క్రమంలో ఇప్పటికైనా పార్లమెంట్‌లో ప్రజాస్వామ్య యుతంగా చర్చలకు అవకాశం రావాలి. ప్రధానంగా కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. కేంద్ర,రాష్ట్రాల్లో ఏ పార్టీ ప్రభుత్వాలు ఉన్నా ప్రజాస్వామ్యం దెబ్బతినరాదు. ప్రజల తీర్పును అపహాస్యం చేయరాదు. ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాపాడడంతో పాటు సంబంధాలను బలపర్చాలి. కేంద్ర,రాష్ట్ర సంబంధాలు, సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న దాడి, గవర్నర్ వ్యవస్థ ద్వారా కేంద్రం పెత్తనం చెలాయించేలా చేస్తున్న ప్రయత్నాల ను అడ్డుకునేలా చట్టాలు రావాలి. ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఈ అంశాలపై చర్చ చేయాలి. ప్రాంతీయపార్టీలు ఇవే అంశాలపై ఆందోళన చెందుతున్నాయి. దీనిపై ఉమ్మడిగా పోరాడాలన్న ప్రయత్నాలు వ్యక్తం అవుతున్నా సంఘటితం కాలేకపోతున్నాయి. ప్రాంతీయ పార్టీల మధ్య సంఘటితం కావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సిఎంలు ఏకాభి ప్రాయానికి రావాల్సి ఉంది. నిజానికి గవర్నర్ వ్యవస్థను కాంగ్రెస్ బాగా భ్రష్టు పట్టించింది. దీనిని రద్దు చేయాలన్న అభిప్రాయం ఉంది. రాజకీయపార్టీలు ముందుగా ఈ విషయంలో చర్చచేయాల్సి ఉంది. మన రాజ్యాంగ నిర్మాతలు కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలుగా విభజించారు. పంచాయత్‌రాజ్ చట్టం ఆమోదించిన తర్వాత, స్థానిక స్వపరిపాలన సంస్థలకు హక్కులు ఇవ్వబడ్డాయి. వాటికి అధికారాలు కేటాయించబడ్డాయి. గ్రామాలు అభివృద్ధి చెందాలి. గ్రామాల అభివృద్ధితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుంది. దేశంలోని గ్రామాలు, రాష్ట్రాల అధికారాలను నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న తీరు సరికాది. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. కేంద్రం తరచూ రాజ్యాంగం నిర్వచించిన అధికార పరిధిని ఉల్లంఘిస్తోంది. కేంద్ర తన పరిధిని విస్తరించే క్రమంలో రాష్ట్రాల అధికారాలను ఆక్రమించాలని చూస్తోంది. ఇది కాంగ్రెస్ హయాంలోనూ జరిగింది. ఇప్పుడు మోడీ హయాంలో నిత్యం జరుగుతోంది. నిజానికి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలహీనపడ్డాయి. అందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రభుత్వమే కారణమని చెప్పుకోవాలి. రాజ్యకాంక్ష విస్తరణతో రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారు. జాతీయ విధానాలను తుంగలో తొక్కారు. రాష్ట్రాలన్ని కలిస్తేనే దేశం అవుతుంది. అలాంటి రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రతి దానికీ బిచ్చం ఎత్తుకునేలా పరిస్థితి తీసుకుని వచ్చారు. అలాగే రాష్ట్రాలు, స్థానిక సంస్థలను లొంగదీసుకునే ఉద్దేశ్యంతో వాటిని నిర్వీర్యం చేస్తున్నారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకి రావాల్సిన నిధులు సక్రమంగా విడుదల కావాలి. ఏ పనులకు కేటాయించిన నిధులు అవి పూర్తి చేసేలా చూడాలి. రానున్న కొత్త ప్రభుత్వం రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని పార్లమెంట్ వేదికగా అన్ని అంశాలు చర్చించాలి. రాష్ట్రాలు లేవనెత్తే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పార్లమెంటులో చట్టాలను ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించుకుంటున్న తీరు గత పదేళ్లుగా చూస్తున్నాం. ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాల్లో రాజ్‌భవన్ ద్వారా సమాంతర ప్రభుత్వాన్ని నడపాలని చూసారు. ఇలా ప్రతి అంశాన్ని చర్చించి అందుకు అనుగుణంగా మన ఎన్నికల సంఘాన్ని ,రాజ్యాంగాన్ని బలోపేతం చేసి భారత ప్రజాస్వామ్యాన్ని ఆదర్శంగా నిలపాలి.

# ప్రశాంతంగా ముగిసిన పార్లమెంట్ ఎన్నికలు

**• ఆర్టీసీ బస్సులో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి పొన్నం • మండలంలో 73.76 శాతం పోలింగ్**



**భీమదేవరపల్లి మే 13 (ప్రజామంటలు) :** మండలములో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. భీమదేవరపల్లి మండలంలో మొత్తం ఓటర్ల సంఖ్య 38,694 కాగా 28,505 ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 14,166, మహిళలు 14,339 ఉన్నారు. హుస్నాబాద్ శాసనసభ్యులు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ లో కుటుంబ సమేతంగా ఆర్టీసీ బస్సులో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వరంగల్ సిపి ఆదేశానుసారం కాజీపేట ఏసీపి తిరుమల్, ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో ముల్కనూర్ ఎస్సై సాయి బాబు, వంగర ఎస్ఐ వెంకటేశ్వర్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భద్రత ఏర్పాట్లు చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 38,694, పోలింగ్ కేంద్రాలు 46 ఉండగా పురుష ఓటర్లు 18,954, మహిళా ఓటర్లు 19,740 ఉన్నారు. మండల వ్యాప్తంగా 5 రూట్లు, 27 లోకేషన్లు, 46 పోలింగ్ బూతులు, సెక్టోరల్ అధికారులు 5 గురు ఉండగా 73.76 శాతం ఓట్లు ఓటర్లు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట మే 13 (ప్రజామంటలు):** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం హుజురాబాద్ నియోజకవర్గం లోని సొంత గ్రామం వీణవంక లోని ప్రభుత్వ పాఠశాలలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, భార్య శాలిని తోపాటు కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌశిక్ రెడ్డి తల్లిదండ్రులు సాయినాథరెడ్డి, శైలజ సోదరుడు కార్తీక్ రెడ్డి, సంతోషిని దంపతులు ఓటు వేశారు. అనంతరం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## తల్లి అంతక్రియలు చేసి ఓటు హక్కు వినియోగించుకున్న తోకల గంగాధర్



**రాయికల్ మే 13 (ప్రజామంటలు):** మండలం ఇటిక్యాల గ్రామంలో తోకల గంగాధర్ ' తల్లి మల్లు' ఈరోజు ఉదయం చనిపోగా అంతక్రియలు పూర్తి చేశాక అంత దుఃఖం లో ఉండి కూడా ఓటు వేయడం మన జన్మ హక్కు అని అది మన కర్తవ్యం అని ఓటు వినియోగించు కున్నారు. అతని దేశభక్తిని గ్రామ ప్రజలు అభినందించారు.

## 95 ఏళ్ల వయసులో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధ మహిళ



**భీమదేవరపల్లి మే 13 (ప్రజామంటలు):** లోక్ సభ ఎన్నికల్లో 95 ఏళ్ల వృద్ధురాలు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించు కున్నది. ముత్తారం గ్రామానికి చెందిన మోకిడి పెద్ద మల్లవ్వ భర్త రాజేశ్వరరావు స్వాతంత్ర సమరయోధుడు, ఊరికి ఆ రోజుల్లో పెద్ద పటేల్. తాను మంచం మీద నుండి లేవలేని పరిస్థితుల్లో ఉండి కూడా తన మనవళ్లు ప్రకాష్, సందీప్, వరుణ్ ల సహాయంతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసింది. అంతేకాకుండా గ్రామ మొదటి ఓటర్ కూడా ఈ మల్లవ్వనే, గ్రామ ఓటర్ల లిస్టులో సీరియల్ నెంబర్ 1. ఈ వయసులో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయడం ఇబ్బందికరమే అయినప్పటికిని, ఓటు వేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న గెల్లు శ్రీనివాస్



**జమ్మికుంట మే 13 (ప్రజామంటలు):** లోక్ సభ ఎన్నికల సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గం వీణవంక మండలం హిమ్మత్ నగర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్న బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ దంపతులు. ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యం రక్షించాలని కోరారు.



పార్లమెంటు ఎలక్షన్స్ లో భాగంగా తన స్వగ్రామం అయిన (కరీంనగర్ పార్లమెంటు) భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నహుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి



గోదావరిఖని పట్టణం జూనియర్ కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకున్న పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, ఆయన సతీమణి స్నేహలత



పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా అంతర్గాం గ్రామంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దంపతులు మరియు మాజీ మంత్రి రాజేశం గౌడ్ వారి యొక్క ఓటును వినియోగించుకున్నారు.



పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తమ సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్ చేర్ పర్సన్ అడువాల జ్యోతి, లక్ష్మణ్ దంపతులు



తమ స్వగ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ తుల ఉమ, తుల రాజేందర్



పార్లమెంట్ ఎన్నికల్లో జగిత్యాల పట్టణంలోని 177 పోలింగ్ స్టేషన్లో ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.





ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్

## ఎస్.కే.ఎన్.ఆర్. బాలికల కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి



**జగిత్యాల మే 13 (ప్రజామంటలు):** సోమవారం నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి తన ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ఎస్ కె ఎన్ ఆర్ బాలికల ప్రభుత్వ కళాశాలలో వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.... అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. దేశ సమైక్యత కోసం పాటుపడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని తన గెలుపు పట్ల ధీమా వ్యక్తం చేశారు.



తల్లి సరోజ వివేకానందతో కలిసి మంచిర్యాల మార్కెట్ రోడ్ లో ఉన్న పాఠశాలలో తన ఓటు ను వినియోగించుకున్న పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**జగిత్యాల మే 13 (ప్రజామంటలు):** లోక్ సభ ఎన్నికల పోలింగ్ జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ప్రజలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని తెలిపారు.
పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు.



గొల్లపల్లి ఓటు వినియోగించుకున్న వయో వృద్ధుడు. సహకరించిన ఎలక్షన్ సహాయకుడు



పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం కరీంనగర్ తీగల గుట్టపల్లి లోని 70వ బూత్ లో ఒక సామాన్య వ్యక్తిలాగ ఓటర్లతో లైన్ లో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

## పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జెడ్పి చైర్ పర్సన్ వసంత, మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి



**జగిత్యాల మే 13 (ప్రజామంటలు):** నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జగిత్యాల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంతసురేష్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ ఎన్నికల ఇంచార్జి లోక బాపురెడ్డి పోలింగ్ సరళిని, పర్యవేక్షించారు. వారి వెంట బి.ఆర్.ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా ఓటింగ్ సరళిపై ఆరా తీయగా,బి.అర్.ఎస్ పార్టీకి అనుకూలంగా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

## ఆపద్బాంధవుడు... వొడితల ప్రణవ్... కారు ప్రమాద బాధితులకు సహాయక చర్యలు



**జమ్మికుంట మే 13 (ప్రజా మంటలు):** వరంగల్ నుండి కాల్వ శ్రీరాంపూర్ మండలం బేగంపేటకు గ్రామానికి ఓటు వేయడానికి వెళుతున్న క్రమంలో కారు ప్రమాదం. కారులో ప్రయాణిస్తున్న వారు శ్రీనివాస్ రమ దంపతుల తోపాటు చిన్న పాప వుంది. అదే దారిలో వావిలాల నుండి ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వస్తున్న దారిలో ప్రమాద ఘటన చూసి గాయపడిన వారికి సహాయక చర్యలు చేపట్టి, 108 కాల్ చేసి అంబులెన్స్ ను రప్పించిన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వొడితల ప్రణవ్.





మండల కేంద్రమైన రేగోడ్‌లో పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎంపీ స్వతంత్ర అభ్యర్థి యండి యాకుబ్ షరీఫ్

## ఎన్నికల పోలింగ్‌ను పరిశీలించిన ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్



**వేలేర్ మే 13 (ప్రజామంటలు):** వేలేరు మండల కేంద్రంలోని పీచర గ్రామంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు కలిసి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్న వరంగల్ పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సింగరావు మండల కో ఆప్షన్ నెంబర్ మహమ్మద్ జానీ సమ్మక్క సారక్క దేవస్థానం చైర్మన్ కొయ్యడ మహేందర్, గ్రామశాఖ అధ్యక్షులు మారబోయిన రాజు, పెడపెల్లి సిద్ధులు వృద్ధుల శ్రీకాంత్, వేముల రాజు, జల్తారి రవి, మోరే రాజు, కొయ్యడ రమేష్, గడ్డి శంకర్రావు యూత్ సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముంబైలో ఈదురుగాలుల బీభత్సం

### హోర్డింగ్ కూలి ముగ్గురు దుర్మరణం

**ముంబై,మే13:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో సోమవారం సాయంత్రం భారీ ఈదురుగాలులు పెను బీభత్సం సృష్టించాయి. తేలికపాటి వర్షంతో పాటు బలమైన గాలులు వీచడంతో ఘట్కోపార్ ప్రాంతంలో భారీ హోర్డింగ్ పేకమూడలా కుప్పకూలి నలుగురు దుర్మరణం పాలయ్యారు. సుమారు 57 మంది గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు రంగంలోకి దిగి తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. హోర్డింగ్ కింద సుమారు 100 మంది చిక్కుకుని ఉంటారని అంచనా వేస్తున్నారు. ఘట్కోపార్ ప్రాంతంలో భారీ బిల్‌బోర్డ్ కుప్పకూలి పెనువిపత్తు సంభవించిన ఈ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్టు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు. 'బిల్‌బోర్డ్ కింద చిక్కుకున్న 47 మందిని ఇంతవరకూ సురక్షితంగా బయటకు తెచ్చాం. యుద్ధప్రాతిపదికన ముంబై పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్, డిజాస్టర్ మేనేజిమెంట్ సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించాం' అని ఫడ్నవిస్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. బృహాన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భూషణ్ గగ్రాని ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియజేస్తూ, ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్‌ను కూడా రంగంలోకి దింపామని, గ్యాస్ కట్టర్లను కూడా ఘటనా స్థలికి పంపామని చెప్పారు. హోర్డింగ్ కుప్పకూలిన ఘటనపై రైల్వే అండ్ అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీ ఎగో మీడియాపై డిజాస్టర్ మేనేజిమెంట్ యాక్ట్ కింద బీఎంసీ ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. కాగా, క్షతగాత్రులను తక్షణ చికిత్స కోసం రాజావాడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# బిఆర్ఎస్ కార్యకర్తల కృషి అమోఘం

**- పార్లమెంట్ ఎన్నికల్లో గట్టిగా కృషి చేశారు - అభినందనలు తెలిపిన కెటిఆర్, హరీష్ రావు**

**హైదరాబాద్,మే13:** లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి అద్భుతమైన ఫలితాలు వస్తాయని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన అనంతరం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లు,తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో అద్భుతమైన పోరాట పటిమ ప్రదర్శించిన క్షేత్రస్థాయి పార్టీ శ్రేణులు అందరికీ కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పారు. ఎదురు దెబ్బలు ఎన్ని కొట్టావన్నది కాకుండా.. ఇప్పటి పరిస్థితుల్లో ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నా.... ఆ సవాళ్లను ఎదుర్కొనీ తిరిగి నిలబడి పోరాటం చేశామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత తిరిగి బలంగా నిలబడి కొట్లాడటం ఆషామాషి వ్యవహారం కాదని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుతమైన నిబద్ధతతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట నడిచి, ఈ ఎన్నికల్లో ప్రజామోదం కోసం కొట్లాడిన తీరు అద్భుతమని అన్నారు. గత ఐదు నెలలుగా సామాజిక మాధ్యమాల్లో పార్టీ కోసం పని చేసిన, ప్రతి ఒక్క సోషల్ మీడియా వారియర్‌కి కేటీఆర్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మ పార్టీ సోషల్ మీడియా వారియర్లు, కార్యకర్తలకు ఇతర పార్టీల మాదిరిగా ఏలాంటి చెల్లింపులు చేయకుండా పార్టీ మీద, తెలంగాణ మీద ప్రేమతో పనిచేశారని కొనియాడారు. కేవలం తెలంగాణ మీద ఉన్న ప్రేమ, కేసీఆర్‌పైన ఉన్న అచంచలమైన విశ్వాసంతో తమ పార్టీ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో తమ వాణిని బలంగా వినిపించి, అద్భుతంగా కొట్లాడారని తెలిపారు. తమ పార్టీ శ్రేణులు చేసిన ఈ పోరాటం.. ఈ ఎన్నికల్లో గొప్ప ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఇదిలావుంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు నిర్విరామంగా పనిచేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఎంతో శ్రమించిన కార్యకర్తల సేవలు వెలకట్టలేని వన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రత్యక్షంగా ప్రజలతో సంబంధం కలిగి ఉండి, అంకితభావంతో మీరు పడిన కష్టం, తపన నాతో పాటు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.



# ఓటేసిన చంద్రబాబు, బాలకృష్ణ

**- పులివెందులలో జగన్ దంపతుల ఓటు - హిందూపురంలో ఓటేసిన బాలకృష్ణ దంపతులు**

**- ఇడుపులపాయలో షర్మిల దంపతుల ఓటు**



**అమరావతి,మే13:** ఎపిలో పలువురు ప్రముఖులు ఉదయమే ఓటు వేశారు. అమరావతిలో చంద్రబాబు సతీమసమేతంగా ఓటేశారు. అలాగే పులివెందులలో జగన్ దంపతులు ఓటేశారు. ఇడుపులపాయలో షర్మిల ఓటేశారు. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు కూడా ఓటేశారు. పవన్ కళ్యాణ్ మంగళగిరిలో ఓటేశారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తన సతీమణి వసుంధరతో కలిసి ఆయన ఓటు వేశారు. హిందూపురంలోని ఓ పోలింగ్ కేంద్రంలో వారు తమ ఓటును వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రం బయట బాలకృష్ణ దంపతులు తమ వేళ్లకు ఉన్న సిరా గుర్తులను చూపించారు. నటుడు బాలకృష్ణ ప్రస్తుతం హిందూపురం సిట్టింగ్



ఎమ్మెల్యేగా ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా ఆయన మరోసారి అక్కడి నుంచే బరిలో నిలిచారు. ఏపీలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దంపతులు సోమవారం ఓటు హక్కును వినియోగింజుకున్నారు. కడప పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షర్మిల, భర్త అనిల్‌తో కలిసి ఇడుపులపాయ లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు దౌర్జాన్యాలకు, దాడులకు పాల్పడుతూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.రైల్వేకోడూరు లో వైసీపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరారు. అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అధికారులు, పోలీసులు నిస్వార్థంగా పనిచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలసిన బాధ్యత ఉందని కోరారు. బిజెపి అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఓటేశారు.

# పల్నాడు జిల్లా తంగెడలో బాంబు దాడులు

**- ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు - పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతల మధ్య పోలింగ్**

**పల్నాడు,మే13:** పల్నాడుజిల్లా గురజాల నియోజకవర్గం మారుమూల ప్రాంతంలో ఉండే తంగెడ గ్రామంలో బాంబుల దాడులతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది . వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఒక్క ఓటు విషయంలో జరిగిన వివాదం ఉదయం నుంచి స్వల్ప ఉద్రిక్తలకు దారితీసింది. సాయంత్రం పోలింగ్ 6 గంటలకు ముగిసిన తరువాత గ్రామంలో రెండు వర్గాలు పెట్రోలు(ఖ।బిసనీ శినీపశిబ), నాటు బాంబులతో ఇళ్లపై దాడి చేసుకున్నారు. దీంతో పలు నివాసపు ఇండ్లు,వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ దాడులో 10 మందికి పైగా తీవ్రగాయాలయినట్లు సమాచారం . ఘటనా విషయం తెలుసుకున్న పోలీసులు అదనపు బలగాలతో గ్రామానికి చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మాచర్ల, గురజాల నియోజకవర్గంలో ఉదయం నుంచే ఘర్షణలు జరిగాయి. కొన్ని ప్రాంతాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోని పలుచోట్ల ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాల్లో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో మోపిదేవి మండలం మోపిదేవి లంక గ్రామంలో వైసీపీ శ్రేణులపై టీడీపీ శ్రేణులు దాడికి దిగారు. ఘటనా స్థలంలో ఉన్న పోలీసులు వెంటనే స్పందించి ఇరు వర్గాలను చెదరగొట్టారు. మరోవైపు.. అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజక వర్గంలో కుందిర్పి మండలం బెస్తరపల్లి గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాల నేతలు ఒకరిపై మరొకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడుల్లో టీడీపీ అభ్యర్థికి చెందిన వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారంటూ ఇరువర్గాలు కొట్టుకున్నాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో తీవ్ర ఉద్రిక్త నెలకొంది. నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తలు గొడవపడ్డారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై మరొకరు రాళ్ల దాడి చేసుకున్నారు. ఆ తర్వాత ఇరువర్గాల చెందిన వాహనాలను ధ్వంసం చేసుకున్నారు. టీడీపీ, వైసీపీ నేతల ఇళ్లపైనా రాళ్ల దాడి జరిగింది. దీంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వెంటనే అలర్ట్ అయిన పోలీసులు ÷రిరగ్ ఓపెన్ చేశారు. అల్లరి మూకలపై రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించారు. కాగా, సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల పలు దుర్ఘటనలు జరగడాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారం ముఖేష్ కుమార్ మీనా తీవ్రంగా పరిగణించారు. ముఖ్యంగా తెనాలి, మాచర్ల, అనంతపురంలో జరిగిన సంఘటలకు బాధ్యులైన వారిని వెంటనే గృహ నిర్బంధం చేయటంతో.. కేసులు పెట్టాలని ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇక, పుంగనూరులో జరిగిన సంఘటనలో నిందితులను వదిలేసిన ఎస్ఐ ని వెంటనే సస్పెండ్ చేయాలని సీఈవో ముకేష్ కుమార్ మీనా ఆదేశించారు.

# మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీలు పెద్ద ఎత్తున ఓటు

**- వైసిపికి అనుకూలంగా ఎన్నికల ఫలితాలు - వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి**



**అమరావతి,మే13:** ఉదయం నుంచి మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీలు పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకున్నారని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు స్పష్టంగా ముందే ఒక నిర్ణయానికి వచ్చేశారని.. వైసీపీ ప్రభుత్వానికి మరోసారి సానుకూల ఫలితాలు వస్తున్నాయన్నారు. ఏపీలో పోలింగ్ సరళి చూస్తే ఆశీస్సులు ఎవరికి ఉన్నాయో చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ సానుకూల ఓటర్ల సరళి ఉప్పెనలా కనిపిస్తుందని.. ఇది చాలా అరుదన్నారు. అంతిమంగా ప్రజలది విజయం అవుతుందన్నారు. టీడీపీ గూండాలు రెచ్చిపోయారు.. ఏకపక్షంగా దాడులు చేశారన్నారు. పల్నాడు జిల్లాలో ఇవాళ అది పరాకాష్టకు చేరుకుందన్నారు. వైసీపీ సంయమనంతో ఉంది.. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి అనుకుందన్నారు. టీడీపీ కవ్వింపు చర్యలకు పాల్పడి.. దాడులకు పాల్పడిందని.. కొందరు పోలీసు అధికారులు కూడా కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఏబీ వేంకటేశ్వర రావు టీడీపీ ఆఫీసులో ఉండి పోలీసు సిబ్బందిని భయపెట్టే పని చేశారని విమర్శించారు. కొన్ని చోట్ల టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందని.. కుప్పం, మాచర్ల, టెక్కలి, సత్తెనపల్లితో పాటు పలు నియోజకవర్గాల్లో టీడీపీ రిగ్గింగ్ చేసిందన్నారు. ఇప్పటికే టీడీపీ రిగ్గింగ్‌పై ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు. ప్రజలకు జగన్ ,వైసీపీ తరపున ధన్యవాదాలు తెలిపారు. పార్టీ శ్రేణులు కూడా సంయమనంతో ఉన్నాయని.. వారికి కూడా సజ్జల రామకృష్ణా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## పరకాల మండలం నాగారంలో టెన్షన్

**వరంగల్,మే13:** తెలంగాణలో పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ పక్రియ పూర్తయింది. కాగా.. పోలింగ్? రాష్ట్రమంతటా ప్రశాంతంగా జరగ్గా, కొన్నిచోట్ల మాత్రం చెదురుమదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా.. వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్-కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ తలెత్తింది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా పరకాల మండలం నాగారంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. పోలింగ్ సెంటర్ దగ్గర బీఆర్ఎస్-కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో.. ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను చెదరగొట్టారు. బీఆర్ఎస్ నాయకులు రత్నాకర్ రెడ్డి, నాగయ్య, గుండె వేణులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతల దాడిని నిరసిస్తూ పరకాల పోలీస్ స్టేషన్ ముందు బీఆర్ఎస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో.. పరకాల-హుజురాబాద్ ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయింది. మరోవైపు.. బీఆర్ఎస్ నేతలకు సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు పోలీసులు.

## మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఢీకొన్న బస్సు

### ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

**జనగామ,మే13:** జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..రఘునాథపల్లిలో నేషనల్ హైవేపై హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో మొబైల్ టిఫిన్ సెంటర్‌ను అతివేగంతో వచ్చిన ఆర్టీసీ గరుడ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో అక్కడే టిఫిన్ చేస్తున్న ముగ్గురు వ్యక్తులు స్పాట్‌లోనే మృతి చెందారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఎన్నికల నిబంధన ఉల్లంఘించిన రేవంత్ రెడ్డి

### అతనిపై చర్యలకు ఇసికి రఘునందన్ ఫిర్యాదు

**దుబ్బాక,మే13:** సీఎం రేవంత్ రెడ్డి లోక్ సభ ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. ఓటేసేందుకు వెళ్లి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి రాజకీయాల గురించి మాట్లాడారని ఆయన విమర్శించారు. దేశ ప్రధాని, బీజేపీ పార్టీ గురించి ఎలా మాట్లాడుతారని రఘునందన్ రావు ప్రశ్నించారు.ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేశామన్నారు. ఆయనను సాయంత్రం వరకు గృహ నిర్బంధంలో ఉంచాలని, ఆయన్ని మాట్లాడనియకుండా ఆదేశాలు ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు చెప్పారు. ఎన్నికలు ముగిసి ఫలితాల తర్వాత సీఎం మాట్లాడితే బాగుంటుందన్నారు. తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్ సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆ భయంతోనే తన స్థానానికి ఎక్కడ ఇబ్బంది వస్తోందోనన్న అనుమానంతో ఓటర్లను ప్రలోభపెట్టేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎన్డీయే కూటమి 190 స్థానాలకే పరిమితం

### ఇండియా కూటమిదే ఆధిక్యమన్న మమత

**కోల్‌కతా,మే13:** కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలోని కాషాయ కూటమిని మట్టికరిపించి విపక్ష ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకొస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.ఇండియా కూటమి బీజేపీని నిలువరించేలా తాము బెంగాల్ నుంచే కూటమికి సాయం చేస్తామని చెప్పారు. తనకు అందిన సమాచారం ప్రకారం ఎన్డీయే కేవలం 190 నుంచి 195 స్థానాలకే పరిమితమవుతుందని, విపక్ష ఇండియా కూటమి 315 స్థానాల్లో గెలుపొందుతుందని అన్నారు.ఉత్తర 24 పరగణాల జిల్లా బన్గావ్‌లో దీదీ లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మోదీ సర్కార్‌కు భంగపాటు తప్పదని ఆమె పేర్కొన్నారు. విపక్ష ఇండియా కూటమి కేంద్రంలో అధికార పగ్గాలు చేపడుతుందని దీదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎక్కడా రీపోలింగ్ అవసరం రాదు

**- ఈసారి భారీగా పెరిగిన పోలింగ్ శాతం - రాత్రి పదివరకు పోలింగ్ జరుగుతుంది**

**- తెనాలి, నరసరావు పేట ఎమ్మెల్యేలను హౌస్ అరెస్ట్ - ఎన్నికల సరహాళిపై ఏపీ సీఈవో ఎంకే మీనా వెల్లడి**



**అమరావతి,మే13** ఎపిలో రీపోలింగ్ అసవరం లేదని,. ఎక్కడా అలాంటి డిమాండ్లు కూడా రాలేదని ఏపీ సీఈవో ఎంకే మీనా వెల్లడించారు. గత ఎన్నికల పోలింగ్ శాతం కంటే ఈసారి పోలింగ్ శాతం పెరుగుతుందని ఆశిస్తున్నామని, ఇప్పుడే పోలింగ్ శాతం చెప్పలేమన్నారు. ఎక్కడా రీ-పోలింగ్ అవసరం లేదని భావిస్తున్నామని ఆయన చెప్పారు. స్క్రూట్నీ తర్వాతే రీ-పోలింగ్ విషయంలో నిర్ధారిస్తామన్నారు. రీ-పోలింగ్ కోసం ఎలాంటి రిక్వెస్టులు రాలేదన్నారు. ఏపీలో ఇంకా 3500 పోలింగ్ స్టేషన్లల్లో పోలింగ్ జరుగుతోందని ఏపీ సీఈవో ఎంకే మీనా వెల్లడించారు. ప్రతి చోటా 100 నుంచి 200 మంది ఉన్నారన్నారు. రాత్రి పది గంటలకల్లా అన్ని చోట్లా పోలింగ్ పక్రియ పూర్తవుతుందన్నారు. పోలింగ్ శాతం బాగా పెరిగిందని నమ్ముతున్నామన్నారు.తెనాలి, నరసరావు పేట ఎమ్మెల్యేలను హౌస్ అరెస్ట్ చేశామన్నారు. ఈవీఎం యూనిట్లను స్ట్రాం÷-రగ్ రూంలకు తరలిస్తున్నామని.. ఉదయం నుంచి పెద్ద ఎత్తున ఓటర్లు వచ్చారన్నారు. ఈవీఎం మెషీన్లతో కొన్ని ఇబ్బందులు వచ్చాయని.. సాంకేతిక ఇబ్బందులు గతంతో పోల్చుకుంటే తక్కువగా ఉన్నాయన్నారు. వాతావరణం బాగా సహకరించిందని ఆయన వెల్లడించారు. తన దగ్గర కార్డు ఉంది కానీ.. ఓటు లేదనే ఫిర్యాదులు ఎక్కడా కన్పించ లేదన్నారు. బందోబస్తు పెద్ద ఎత్తున పెట్టామన్నారు. సమస్యలు వచ్చిన ఈవీఎంలను వెంటనే మార్చేశామన్నారు. ఓటర్ల నమోదు ముందుగా చేపట్టడంతో పెద్ద సంఖ్యలో పోలింగ్ నమోదైందని సీఈవో చెప్పుకొచ్చారు. కొన్ని చోట్ల ఘర్షణలు జరిగినా కట్టడి చేశామన్నారు. పల్నాడులో 12 చోట్ల ఘర్షణలు జరిగాయని.. పల్నాడులో ఒక చోట ఈవీఎంను ధ్వంసం చేశారు.. ఈవీఎంలోని చిప్‌లో డేటా భద్రంగా ఉందన్నారు. ఈవీఎంలను మార్చి మళ్లీ పోలింగ్ ప్రారంభించా మన్నారు. అన్నమయ్య జిల్లాలో కూడా ఇలాంటి ఘటనే జరిగిందని.. 11 చోట్ల ఈవీఎంలను ధ్వంసం చేశారన్నారు. అక్కడ మిషన్లు మార్చి పోలింగ్ పునరుద్ధరించామని చెప్పారు. పల్నాడు, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో అదనపు బలగాలు మోహరించాయన్నారు. పీలేరులో ఏజెంట్ల కిడ్నాప్ ఘటన జరిగినా.. వెంటనే సమస్య పరిష్కరించామన్నారు. పల్నాడులో 12 ఘటనలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి.మాచర్ల పరిధిలో 8 ఈవీఎం మెషీన్లని ధ్వంసం చేశారని.. కానీ డేటా ఎక్కడికీ పోలేదన్నారు. పోలింగ్ కొద్దిసేపు అంతరాయం కలిగింది.. ఆ తర్వాత పోలింగ్ ప్రారంభించామని చెప్పారు. హింసాత్మక ఘటనలు జరిగినా.. మెషీన్ల డామేజ్ జరిగినా పోలింగ్ నిర్వహించగలిగామన్నారు. ఎక్కడా రీ-పోలింగ్ అవసరం లేదన్నారు. తెనాలి, అనంతపురంలలో లీడర్లను హౌస్ అరెస్ట్ చేశామని ఏపీ సీఈవో ఎంకే మీనా వెల్లడించారు.

# పోలీసులకే రక్షణ లేకుండా పోయింది

**- తాడిపత్రిలో ఎస్పీ వాహనంపైనే దాడి అమానుషం - హింసాత్మక ఘటనలపై చంద్రబాబు ఆగ్రహం**

**అమరావతి,మే13:** ఏపీలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్ వేళ పలుచోట్ల వైకాపా శ్రేణులు రెచ్చిపోవడంపై తెదేపా అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. నేటి పోలింగ్‌లో వైకాపా హింస ఎంతవరకు వెళ్లిందంటే.. కనీసం పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోయింది. తాడిపత్రిలో ఏకంగా ఎస్పీ వాహనం పైనే దాడి చేయడం.. తాడిపత్రి టీడీపీ అభ్యర్థి అస్మిత్ రెడ్డిపై దాడికి దిగడం, వైసీపీ హింసా రాజకీయాలకు పరాకాష్ఠ. జగన్ ఐదేళ్లుగా పెంచి పోషించిన రౌడీ మూకలు.. ఈరోజు తమ దాడుల ద్వారా ప్రజల్లో భయం పుట్టించి పోలింగ్ శాతాన్ని తగ్గించడం ద్వారా లబ్ది పొందే కుట్ర చేస్తున్నారు. ప్రజలారా... ఈ కుట్రను మీరే తిప్పికొట్టాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ నిర్భయంగా తరలివచ్చి ఓటు వేయాలి. అత్యధిక ఓటు శాతంతో హింసా రాజకీయానికి ముగింపు పలకాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఇకపోతే రాష్ట్రంలో ఓటరు చైతన్యం వెల్లివిరిసిందని, ఉదయం 7గంటల నుంచే పెద్ద సంఖ్యలో పోలింగ్ బూత్‌లకు తరలి వచ్చి ఓట్లు వేసిన వారికి తెదేపా అధినేత చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పుడు సాయంత్రం 5 గంటలైంది.. ఉదయం 7 గంటలకు ఎంత పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నారో.. పోలింగ్ ముగిసే ఈ సమయంలో కూడా అంతే ఉత్సాహంగా ఓట్లు వేస్తున్నారు. ప్రజలు ఓటింగ్‌పై ఇంత ఉత్సాహం చూపడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామం. ఆ వర్గం ఈ వర్గం అని తేడా లేకుండా అందరూ వచ్చి ఓటేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో అదే జోరు కనిపిస్తోంది. మాచర్ల, నరసరావుపేట వంటి చోట్ల ఓటమి భయంతో వైకాపా హింసకు పాల్పడింది. తాడిపత్రిలో ఏకంగా ఎస్పీ వాహనంపైనే వైకాపా గూండాలు దాడి చేశారు. నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు వాహనాలపై దాడికి పాల్పడ్డారు. మరోవైపు తెనాలిలో వైకాపా ఎమ్మెల్యే ఓటరుపై చేయి చేసుకున్నారు. ఈ స్థాయిలో హింస జరిగినా ప్రజలు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఇంకా పోలింగ్ కేంద్రాలకు వస్తూనే ఉన్నారు. ఈ చైతన్యం, ఈ సంకల్పం చూస్తుంటే.. ఈ రోజు రాత్రి వరకు కూడా పోలింగ్ జరిగే అవకాశం కనిపిస్తోందని అన్నారు. కచ్చితంగా ఓటు వేయాలనే ప్రజల ఈ సంకల్పం రాష్ట్రానికి మేలు చేస్తుంది. గత ఎన్నికల్లో 80 శాతం ఓటింగ్ జరిగింది. ఇప్పుడున్న జోరు చూస్తే 85 శాతంపైగా పోలింగ్ జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ పరిణామాన్ని కూటమి స్వాగతిస్తోంది. సాయంత్రం 6 గంటలలోపు క్యూ లైన్‌లో ఉండే ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం ఉంటుంది. దీన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరు తమ తీర్పును ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా. నేటి మీ ఓటు.. రేపటి మీ భవితకు బంగారు బాట అవుతుంది. స్వేచ్ఛ, స్వాతంత్యం÷-ర.. కనీస హక్కులతో కూడిన గౌరవప్రదమైన జీవితాన్ని మీకు అందించేది ప్రజాస్వామ్యం. ఆ ప్రజాస్వామ్యాన్ని మీ ఓటుతో కాపాడండని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

# ఇవిఎంలు భద్రపరచిన గోడౌన్లలో సిసిటీవీలు ఆఫ్

**ఈవీఎంల భద్రతపై సుప్రియా సూలే ఆందోళన**

**ముంబై,మే13:** మహారాష్ట్రలోని బారామతి లోక్‌సభ నియోజక వర్గంలో ఈవీఎంల భద్రతపై ఆ నియోజకవర్గం ఎన్‌సీపీ(ఎస్‌పీ) అభ్యర్థి సుప్రియా సూలే ఆందోళన వ్యక్తం చేశారు. ఓటింగ్ అనంతరం ఈవీఎంలు భద్రపరచిన గిడ్డంగిలో సోమవారం 45 నిమిషాల పాటు సీసీటీవీలను స్విచ్ఛాఫ్ చేశారని ఆమె ఆరోపించారు. బారామతి నియోజకవర్గంలో సుప్రియా సూలేపై ఆమె కజిన్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భార్య సునీతా పవార్ పోటీ చేస్తున్నారు. బారామతి లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తర్వాత ఈవీఎంలు ఉంచిన గోదాములో సీసీటీవీలను ఈరోజు ఉదయం 45 నిమిషాలు నిలిపేశారు. ఈవీఎంలు భద్రపరిచిన గోదాములో ఈ పరిణామం చోటుచేసుకోవడం అనుమానాస్పదంగా ఉంది. ఇది అది పెద్ద భద్రతా లోపం' అని సుప్రియ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల ప్రతినిధులను, అధికారులను, జిల్లా యంత్రాగాన్ని సంప్రదించినా సంతృప్తికరమైన జవాబు రాలేదని, ఈవీఎంలు ఉంచిన ప్రాంతంలో టెక్నీషియన్లు కూడా అందుబాటులో లేరని ఆమె తెలిపారు. ఈవీఎంల స్టోరేజీ స్టేటస్‌ను తెలుసుకునేందుకు తన ఎన్నికల ప్రతినిధులను కూడా అనుమతించలేదని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ వెంటనే దీనిని పరిగణనలోకి తీసుకుని సీసీటీవీలు క్లోజ్ కావడానికి కారణాలను వెల్లడించాలని ఆమె కోరారు. ఈ ఘటనకు కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కాగా, ఈవీఎంలు ఉంచిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోదాములోని సీసీటీవీ కెమెరాలు ఉదయం 10.30 గంటల నుంచి 11.15 నిమిషాల వరకూ స్విచ్ఛాఫ్ అయినట్టు సుప్రియ ఎన్నికల ప్రతినిధి లక్ష్మీకాంత్ ఖబియా తెలిపారు. సీసీటీవీలు 24 గంటలూ పనిచేస్తాయని ఎన్నికల అధికారులు చెప్పారని, తమ ప్రతినిధులు అక్కడే ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని ఖబియా చెప్పారు. అయితే సోమవారం సీసీటీవీలు 45 పాటు నిలిచిపోయినట్టు తమకు సమాచారం వచ్చిందని, పోలీసుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లడంతో పాటు, బారామతి రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదును అందజేస్తున్నామని అన్నారు. కాగా, గోదాము ఆవరణలో ఎలక్ట్రిక్ పనుల కారణంగా స్వల్పవ్యవధి పాటు కెమెరాల కేబుల్‌ను తొలగించినట్టు ఎన్నికల అధికారులు వివరణ ఇచ్చారు. దీనిపై బారామతి రిటర్నింగ్ అధికారి కవిత ద్వివేది మాట్లాడుతూ, ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఫిర్యాదుపై విచారణ చేశామని, గోదాములోని ఒక కేబుల్‌ను ఎలక్ట్రీషియన్ తొలగించడంతో డిస్‌ప్లే యూనిట్ షట్‌డౌన్ అయినట్టు తెలిసిందని చెప్పారు.

# ఎపి ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు

**- తెనాలి, మాచర్ల, అనంతపురం ఘటనలపై ఇసి సీరియస్ - తెనాలి వైకాపా అభ్యర్థి గృహనిర్బంధానికి ఆదేశం - పుంగనూరు ఎస్ఐ సస్పెన్షన్‌కు ఆదేశం**

**- వైకాపా తీరుపై టిడిపి ఆగ్రహం..ఇసికి ఫిర్యాదు - 120 ఘటనలు జరిగాయని కనకమేడల వెల్లడి**

**అమరావతి,మే13:**ఆంధ్రప్రదేశ్‌లోఎన్నికలు హింసాత్మకంగా మారాయి. పలుచోట్ల వైకాపా శ్రేణులు దాడులుకు దిగాయి. గుం టూరు జిల్లా తెనాలి, పల్నాడు జిల్లా మాచర్ల, అనంతపురంలో జరి గిన సంఘటలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. దాడులకు పాల్పడిన వారిపై గృహనిర్బంధంతో పాటు కేసులు పెట్టా లని ఈసీ ఆదేశించింది. పుంగనూరులో నిందితులను వదిలేసిన ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని ఆదేశించింది. సాయంత్రం 4-6 గంటల మధ్య ఎలాంటి ఘటనలు జరిగినా చర్యలు తీవ్రంగా ఉంటా యని హెచ్చరించింది. ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని తెలుగుదేశం పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈమేరకు తెదేపా అధినేత చంద్రబాబు రాసిన లేఖతో పాటు మరో 11 ఫిర్యాదులను మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ ఈసీకి అందజేశారు. ఉదయం నుంచి రాష్ట్రంలో 120కి పైగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెనాలి వైకాపా అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌పై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే ఆయన్ను అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. పోలింగ్ పూర్తయ్యే వరకు శివకుమార్‌ను గృహనిర్బం ధంలోనే ఉంచాలని పేర్కొంది. పోలింగ్ కేంద్రంలో శివకుమార్ క్యూలైన్‌లో వెళ్లకుండా నేరుగా వెళ్లడంపై ఓటరు అభ్యంతరం చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన శివకుమార్.. ఓటరు చెంపపై కొట్టారు. వెంటనే ప్రతిఘటించిన ఓటరు.. వైకాపా అభ్యర్థి చెంప చెళ్లుమని పించారు. అనంతరం శివకుమార్ అనుచరులు ఓటరుపై విచక్షణారహితంగా దాడికి దిగారు.

ఈ ఘటన ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఇసికి టిడిపి ఫిర్యదు చేసింది. ఉదయం నుంచి ఏపీలో 120కి పైగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని తెదేపా మాజీ ఎంపీ కనక మేడల రవీంద్రకుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పోలింగ్ వేళ శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. ఈమేరకు తెదేపా అధినేత చంద్రబాబు రాసిన లేఖతో పాటు మరో 11 ఫిర్యాదులను కనకమేడల ఈసీకి అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అన్ని చోట్లా వైకాపా నేతలు హింసకు పాల్పడుతున్నారు. తెదేపా కార్యకర్తలు, ఏజెంట్లు, నేతలపై దాడి జరుగుతున్నా.. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు సహకరిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వైకాపా అభ్యర్థులు, నేతలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అన్నారు. తెనాలి, తాడిపత్రి, నరసరావుపేట వైకాపా అభ్యర్థులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. పల్నాడు, తాడిపత్రి, పులివెందుల సహా పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరిగాయి. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని ఈసీ దృష్టికి తీసుకెళ్లాం. పలుచోట్ల పోలింగ్ నిలిపివేయడం దారుణం. ఈవీఎంలు ధ్వంసం చేసి, పలు చోట్ల ఓట్లు వేయకుండా ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. శాంతిభద్రతల పరిణామాలు, ఓటింగ్ తీరు ఆందోళన కలిగిస్తోంది.

# చెదురుముదురు ఘటనల మధ్యముగిసిన పోలింగ్

**- ఎపిలో భారీగా తరలి వచ్చి ఓటేసిన ప్రజలు - పోలింగ్ శాతంపై నేడు స్పష్టత వచ్చే అవకాశం - 75శాతం వరకు నమోదైనట్లు అంచనా**

**హైదరాబాద్/అమరావతి,మే13:** హింసాత్మక ఘటనల మధ్య తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం 6గంటలకు పోలింగ్ సమయం ముగిసింది. 6గంటల సమయానికి క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ ఉత్సాహంగా ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో గతంలో కంటే పోలింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉండటంతో రాత్రి 10 గంటల వరకు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. పోలింగ్ సమయం ముగిసే సరికి దాదాపు75 శాతం పోలింగ్ నమోదైనట్టు తెలుస్తోంది. తుది పోలింగ్ శాతంపై మంగళవారం ఉదయానికి పూర్తి స్పష్టత వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. పల్నాడు, అనంతపురం, కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ఎక్కువగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి.



తాడిపత్రిలో జిల్లా ఎస్పీపైనే వైకాపా శ్రేణులు దాడులకు పాల్పడ్డారు. గుంటూరు జిల్లా తెనాలిలో వైకాపా ఎమ్మెల్యే ఓటరుపై దాడి చేయడం కలకలం రేపింది. వినుకొండ నియోజకవర్గం శావల్యాపురం మండలం కారుమంచిలోని పోలింగ్ బూత్ 136లో 200 ఓట్లు మిగిలి ఉండగానే.. అధికారులు పోలింగ్ నిలిపివేశారు. వీవీ ప్యాట్లు అయిపోయాయని, ఛార్జింగ్ లేదని అధికారులు చెప్పారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ చెదురుమదురు ఘటనల మినహా ప్రశాంతంగా ముగిసింది. మావోయిస్టు ప్రభావితప్రాంతాలైన ఐదు ఎంపీ నియోజకవర్గాల పరిధిలోని 13అసెంబ్లీ సెగ్మెంట్లు సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వరావుపేటలో సాయంత్రం 4గంటలకు పోలింగ్ ముగిసింది. జగిత్యాల జిల్లాలో ఓటేస్తూ ఫొటో తీసుకున్న జయరాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఓటింగ్ కేంద్రాల వద్ద సెల్ఫీపాయింట్

**ఇసి నిర్ణయంతో సత్ఫలితాలు**

**హైదరాబాద్,మే13:** తెలంగాణ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. ఓటు వేసేందుకు వయోజనులు ఉదయమే పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. ప్రతి ఒక్కరు ఓటు వేయాలని ఎన్నికల సంఘం ప్రజలకు పిలుపునిచ్చింది. ఓటు హక్కు విధిగా ఉపయోగించుకోవాలని సెలబ్రిటీలు కోరారు. ఈ సారి పోలింగ్ కేంద్రాల వద్ద సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. జనాలు సెల్ఫీ అంటే ఇంట్రెస్ట్ చూపించడంతో వారి అభీష్టం మేరకు సెల్ఫీ పాయింట్ నెలకొల్పారు. దీంతో కొందరు ఓటు అంటే ఇంట్రెస్ట్ చూపని వారు కూడా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేస్తున్నారు. ఓటు వేసిన తర్వాత సెల్ఫీ దిగుతున్నారు. ఆ పిక్స్ వాట్సాప్ స్టేటస్, వాట్సాప్ గ్రూపులు, ఫేస్ బుక్, ఎక్స్‌లో షేర్ చేస్తున్నారు. మేము ఓటేశాం.. మరి మీరు అని ఫ్రెండ్స్‌ను అడుగుతున్నారు. ఓటు హక్కు గురించి సోషల్ మీడియా వేదికగా అవగాహన కల్పిస్తున్నారు. ఆ సెల్ఫీ పాయింట్ మీద ఇలా రాసి ఉంది. 'మెరుగైన భవిష్యత్ కోసం ఓటు వేయండి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు నీ ఆయుధం. ఈ రోజు నేను నా ఓటు హక్కును వినియోగించుకున్నాను. మరి మీరు అని' రాసి ఉంది. సెల్ఫీ పాయింట్ అని కింద ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం, నియోజకవర్గం పేరు కూడా ఉంది. ఓటు హక్కు బాధ్యతను ఎన్నికల సంఘం సెల్ఫీ పాయింట్ ద్వారా తెలియజేసింది. సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయడం వల్ల జనాల నుంచి మంచి స్పందన లభిస్తోంది. గతంలో కన్నా ఓటింగ్ శాతం పెరుగుతోంది. ఈ విషయం పోలింగ్ శాతం చూస్తే అర్థమవుతోంది. సాయంత్రం వరకు అది మరింత పెరిగే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు అంచనా వేశారు. తెలంగాణలో ఈ రోజు వాతావరణం కూడా చల్లగా ఉండటం ఓటింగ్ శాతం పెరిగేందుకు కలిసి వస్తోంది.

# ఏలూరులో వైసీపీ నేతల అరాచకం

**పోణంగి గ్రామంలో టీడీపీ కార్యకర్తలపై దాడి**

**పలుచోట్ల వైకాపా కార్యకర్తల దాడులు**

**ఏలూరు,మే13:** సజావుగా సాగాల్సిన ఎన్నికల వేడుకను వైసీపీ నేతలు రసాభసాగా మార్చేస్తున్నారు. అధికార మదంతో పోలింగ్ బూతుల వద్ద రెచ్చిపోతున్నారు. తమ పార్టీకే ఓట్లు వేయాలంటూ ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నం చేయడమే కాదు.. ఉద్దేశపూర్వకంగానే టీడీపీ కార్యకర్తలు, ఓటర్లు, రిపోర్టర్లపై దాడులకు తెగబడుతున్నారు. తాజాగా ఏలూరులోనూ వైసీపీ నేతల అరాచకం బయటపడింది. ఏలూరు శివారులోని పోణంగి గ్రామంలో టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. స్థానిక వైసీపీ నేత ఈ దారుణానికి ఒడిగట్టాడు. బయటి నుంచి ప్రత్యేకంగా గూండాలను తీసుకొచ్చి మరీ తెలుగుదేశం కార్యకర్తలను కొట్టించాడు. ఈ దాడిలో ఓ టీడీపీ కార్యకర్త పీక వద్ద తీవ్ర గాయం కావడంతో.. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అటు.. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని భవానిపురం స్వాతి సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జలీల్ ఖాన్ వర్గానికి, వైసీపీ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. జలీల్ ఖాన్‌కు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు నినాదాలు చేస్తూ.. ఆయనపై దాడికి దిగారు.ఈ పరిణామంతో తీవ్ర ఆగ్రహావేశాలకు గురైన జలీల్ ఖాన్ వర్గీయులు.. వారిపై తిరగబడ్డారు. ఇదే సమయంలో వైసీపీ మద్దతుదారులు రోడ్డుపై బైఠాయించి గందరగోళ వాతావరణాన్ని సృష్టించింది. పోలీసులు రంగంలోకి దిగి.. స్వల్ప లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. మరోవైపు.. తిరుపతిలోని బ్రాహ్మణ కాల్వలోని పోలింగ్ బూత్ వద్ద వైసీపీ అభ్యర్థి మోహిత్ రెడ్డి రెచ్చిపోయారు. ఓ రిపోర్టర్‌పై దుర్భాషలాడుతూ.. ఆయన ఫోన్ తీసుకొని, నేలకేసి కొట్టి పగలకొట్టారు. పల్నాడు జిల్లాలోని ముప్పాళ్ళ మండలం మాదల పోలింగ్ బూత్ వద్ద కూడా వైసీపీ శ్రేణులు చెలరేగిపోయారు. ఎన్నికల నిబంధనల్ని అతిక్రమిస్తూ.. పోలింగ్ బూత్‌పై రాళ్లు రువ్వారు. స్థానిక ఓటర్లందరూ టీడీపీకి ఓట్లు వేస్తున్నారన్న విషయం తెలిసి.. ఆ అక్కసుతో వైసీపీ వాళ్లు రాళ్లు రువ్వారు. దీంతో టీడీపీ సానుభూతిపరులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ పరిణామంతో షాక్‌కు గురైన కొందరు.. ఆందోళన చెందారు. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలు అవ్వడంతో.. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. అటు.. పరిస్థితుల్ని అదుపు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు.

# జగన్‌కు అనుకూలంగా ఫలితాలు : కెటిఆర్



**హైదరాబాద్,మే13:** పోలింగ్ స్టేషన్ల దగ్గర కరెంటు కోతలు లేకుండా ముగ్గురేసి అధికారులను పెట్టి ప్రభుత్వం చాలా కష్టపడుతోందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. జనరేటర్లను కూడా అందుబాటులో ఉంచారన్నారు. ఐదేండ్లకోసారి జరిగే ఈ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. దయచేసి అందరూ బయటికి వచ్చి పోలింగ్ లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇవాళ నంది నగర్ లోని జిహెచ్‌ఎంసి కమ్యూనిటీ హాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్న కేటీఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనకు సోదరుడి లాంటి వారని, ఈ ఎన్నికల్లో ఆయన మంచి ఫలితాలు సాధిస్తారనే నమ్మకం తనకు ఉందని అన్నారు. ఆరు గ్యారంటీలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఒక గ్యారెంటీని సగం సగం అమలు చేసిందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తాను ముఖ్యమంత్రిని గుర్తించాలని అన్నారు. కరెంటు కోతలు, నీటి కొరతల వంటి అసలైన సమస్యల పైన రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ప్రజలు ఎవరికి ఓటేస్తారో నాలుగో తేదీన తేలుతుందని అన్నారు. పదేండ్ల నుంచి నరేంద్ర మోడీ ప్రజలని మోసం చేస్తుంటే.. వందరోజుల నుంచి ఇక్కడ రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని అన్నారు.

# నాగర్ కర్నూలులో ఓటేసిన ప్రవీణ్ కుమార్



**నాగర్‌కర్నూల్,మే13:** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అలంపూర్ పట్టణంలో తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. అలంపూర్ పట్టణంలోని పోలింగ్ బూత్ నంబర్ 272లో ఆర్‌ఎస్పీ ఓటేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. నాకు జన్మనిచ్చిన గడ్డ అలంపూర్‌లో తాను ఓటు హక్కును వినియోగించుకున్నాను. గ్రామాల్లో ఓట్ల పండగ వాతావరణం కనిపిస్తోంది. ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు పెద్ద ఎత్తున ఓటర్లు తరలివస్తున్నారు. ఇదీ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనం. ఓటు హక్కు నిశ్శబ్ద విప్లవానికి నాంది.ప్రజలే న్యాయ నిర్ణేతలుగా ఇచ్చే ఎన్నికల తీర్పులో? భారత రాజ్యాంగం రక్షించబడాలి, ప్రజాస్వామ్యం ఫరిఢవిల్లాలి. మీరు కూడా మీ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోండి.

# ఎన్నికల సంస్కరణలు తక్షణావశ్యకం !

దేశవ్యాప్తంగా నాలుగోవిడత ఎన్నికలు ఉత్సాహంగా సాగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎన్నికలతో పాటు, ఏపిలో అసెంబ్లీ ఎన్నికలకు ఓటేసేందుకు ప్రజలు బారులు తీరారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రజలు ఓటేసేందుకు సొంతూళ్లకు వెళ్లడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చెప్పుకోవాలి. అయినా ఓటర్లు ఇంకా ఇల్లు విడిచి బయటకు రావడానికి వెనకాడడం సహించరాని నేరంగా పరిగణించాలి. ఓటర్లు అంతా నూటికినూరు శాతం కాకున్నా కనీసం 90శాతం మంది ఓటేస్తేనే ప్రజల పూర్తి అభిప్రాయం తెలుస్తుంది. ఇందుకోసం కఠిన చట్టాలు తీసుకుని రావాలి. ఓటేయడం ఖచ్చితం చేయాల్సిన ఆగత్యం వరుస ఎన్నికల్లో ఓటింగ్ శాతాలను బట్టి తెలుస్తోంది. ఇప్పటికే మూడుదశల్లో ఎన్నికలు ముగిసాయి. ఈ ఎన్నికల్లో కూడా 70శాతం పోలింగ్ కూడా నమోదు కాలేదు. నాలుగో విడత కూడా మందకొడిగానే పూర్తి కావచ్చింది. ప్రజలు ఎవరికి అధికారం కట్టబెట్టాలో తీర్పునిచ్చారు. మరో మూడు విడతల్లో జూన్ 1 వరకు ఎన్నికలు జరుగనున్నాయి. జూన్ 4న ఫలితాలు వెల్లడితో ఎవరు అధికారంలోకి రాబోతున్నారో తేలనుంది. ఈ మూడు విడతల్లో అయినా మరింత ఉత్సాహంగా ఓటేసేలా ప్రజలు ముందుకు రావాలి. ఇకపోతే ఎన్నికల చట్టంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఇన్నేళ్లుగా వస్తున్న ఓట్ల పండగలను బట్టి గమనించవచ్చు. ప్రధానంగా పటిష్టమైన ఓటుకార్డు..పర్మినెంట్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలి. మనిషి మరణించేవరకు ఓటును ఆధార్, పాన్‌లాగా దాచుకునేలా పటిష్టం చేయాలి. అలాగే ఓటు వేయడం అన్నది విధిగా చేయాలి. ఇంట్లో కూర్చుని ఓటేయకపోవడాన్ని నేరంగా పరిగణించాలి. ఈ రెండూ చేస్తే కొంత మార్పు రావచ్చు. ఇకపోతే రాజకీయ పార్టీల ప్రలోభాలను అరికట్టాలి. డబ్బుల పంపిణీ, గిఫ్టుల పంపిణీ చేస్తే పార్టీ గుర్తు రద్దు చేసేలా చేయాలి. అట్టహాసంగా సభలు పెట్టే దానిని కూడా నియంత్రించాలి. సోషల్ మీడియా, టివి రంగం అందుబాటులోకి వచ్చింది కనుక ప్రచారం పరిమితం చేయాలి. జనాలను అదేపనిగా లక్షల సంఖ్యలో తరలించి భారీ బహిరంగ సభలను నిర్వహించే పద్ధతిని నిర్మూలించగలగాలి. ఎన్నికలను రాజకీయ పార్టీలు ఖరీదైనవిగా చేస్తూ పోతున్నాయి. సామాన్యులు పోటీ చేయకుండా అడ్డుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరస్థులు, గుండాలు, డబ్బున్న వారు మాత్రమే పోటీ చేయగలుగుతున్నారు. ఇకపోతే జనాభా నియంత్రణ కూడా ఇందులో జోడించాలి. అత్యధిక మందిని కంటున్న వారిపై ఆంక్షలు పెట్టాలి. అలాంటివారు పోటీచేయకుండా, ఓటేయకుండా చేయాలి. ఎన్నికల సంస్కరణలపై కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వం చర్చించాలి. పటిష్టమైన ఎన్నికల విధానం రావాలి. అలా వచ్చిన తరవాత ఎన్నికైన వారు ప్రజాస్వామ్య బద్దంగా నడుచుకునేలా మన వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఈ క్రమంలో ఇప్పటికైనా పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యయుతంగా చర్చలకు అవకాశం రావాలి. ప్రధానంగా కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. కేంద్ర,రాష్ట్రాల్లో ఏ పార్టీ ప్రభుత్వాలు ఉన్నా ప్రజాస్వామ్యం దెబ్బతినరాదు. ప్రజల తీర్పును అపహాస్యం చేయరాదు. ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాపాడడంతో పాటు సంబంధాలను బలపర్చాలి. కేంద్ర,రాష్ట్ర సంబంధాలు, సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న దాడి, గవర్నర్ వ్యవస్థ ద్వారా కేంద్రం పెత్తనం చెలాయించేలా చేస్తున్న ప్రయత్నాల ను అడ్డుకునేలా చట్టాలు రావాలి. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఈ అంశాలపై చర్చ చేయాలి. ప్రాంతీయపార్టీలు ఇవే అంశాలపై ఆందోళన చెందుతున్నాయి. దీనిపై ఉమ్మడిగా పోరాడాలన్న ప్రయత్నాలు వ్యక్తం అవుతున్నా సంఘటితం కాలేకపోతున్నాయి. ప్రాంతీయ పార్టీల మధ్య సంఘటితం కావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సిఎంలు ఏకాభి ప్రాయానికి రావాల్సి ఉంది. నిజానికి గవర్నర్ వ్యవస్థను కాంగ్రెస్ బాగా భ్రష్టు పట్టించింది. దీనిని రద్దు చేయాలన్న అభిప్రాయం ఉంది. రాజకీయపార్టీలు ముందుగా ఈ విషయంలో చర్చచేయాల్సి ఉంది. మన రాజ్యాంగ నిర్మాతలు కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలుగా విభజించారు. పంచాయత్‌రాజ్ చట్టం ఆమోదించిన తర్వాత, స్థానిక స్వపరిపాలన సంస్థలకు హక్కులు ఇవ్వబడ్డాయి. వాటికి అధికారాలు కేటాయించబడ్డాయి. గ్రామాలు అభివృద్ధి చెందాలి. గ్రామాల అభివృద్ధితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుంది. దేశంలోని గ్రామాలు, రాష్ట్రాల అధికారాలను నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న తీరు సరికాదు. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. కేంద్రం తరచూ రాజ్యాంగం నిర్వచించిన అధికార పరిధిని ఉల్లంఘిస్తోంది. కేంద్ర తన పరిధిని విస్తరించే క్రమంలో రాష్ట్రాల అధికారాలను ఆక్రమించాలని చూస్తోంది. ఇది కాంగ్రెస్ హయాంలోనూ జరిగింది. ఇప్పుడు మోడీ హయాంలో నిత్యం జరుగుతోంది. నిజానికి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలహీనపడ్డాయి. అందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రభుత్వమే కారణమని చెప్పుకోవాలి. రాజ్యకాంక్ష విస్తరణతో రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారు. జాతీయ విధానాలను తుంగలో తొక్కారు. రాష్ట్రాలన్ని కలిస్తేనే దేశం అవుతుంది. అలాంటి రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రతి దానికీ బిచ్చం ఎత్తుకునేలా పరిస్థితి తీసుకుని వచ్చారు. అలాగే రాష్ట్రాలు, స్థానిక సంస్థలను లొంగదీసుకునే ఉద్దేశ్యంతో వాటిని నిర్వీర్యం చేస్తున్నారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకి రావాల్సిన నిధులు సక్రమంగా విడుదల కావాలి. ఏ పనులకు కేటాయించిన నిధులు అవి పూర్తి చేసేలా చూడాలి. రానున్న కొత్త ప్రభుత్వం రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని పార్లమెంట్ వేదికగా అన్ని అంశాలు చర్చించాలి. రాష్ట్రాలు లేవనెత్తే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పార్లమెంటులో చట్టాలను ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించుకుంటున్న తీరు గత పదేళ్లుగా చూస్తున్నాం. ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాల్లో రాజ్‌భవన్ ద్వారా సమాంతర ప్రభుత్వాన్ని నడపాలని చూసారు. ఇలా ప్రతి అంశాన్ని చర్చించి అందుకు అనుగుణంగా మన ఎన్నికల సంఘాన్ని ,రాజ్యాంగాన్ని బలోపేతం చేసి భారత ప్రజాస్వామ్యాన్ని ఆదర్శంగా నిలపాలి.

# కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొత్తగా సాగాలి

**- దేశంలో అనేకానేక సమస్యలపై చర్చకు సిద్ధం కావాలి**

**- కేంద్ర,రాష్ట్రాల సంబంధాల్లో అగాథం పూడ్చాలి - రాష్ట్రాల హక్కులను హరించే చర్యలను పక్కన పెట్టాలి**

**న్యూఢిల్లీ,మే13:** మరో మూడు విడల్లో ఎన్నికలు ముగిసి, జూన్ 4న ఫలితాలు వెలువడ్డ తరవాత కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడనుంది. కొత్తగా ఏర్పాడే ప్రభుత్వం కొత్త ఆశలతో ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రధానంగా ఇప్పటి వరకు జరిగిన అనేక అవకతవకలపై వచ్చిన విమర్శలను ముందుకు పెట్టుకుని పాలనను మరింత పారదర్శకంగా ముందుకు సాగించాలి. ఇంతకాలం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై బిజెపి ప్రభుత్వం కేంద్ర విచారణ సంస్థలను, గవర్నర్లను ప్రయోగించి, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న తీరును పరోక్షంగా సుప్రీం గతంలోనే హెచ్చరించింది. గవర్నర్ల తీరును సుప్రీం పలు సందర్భాల్లో ఆక్షేపించింది. ఈ క్రమంలో కేంద్రంలో ఎన్‌డిఎ కూటమి, ఇండియా కూటమిల్లో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేసినా గతంలో చేసిన పాపాలను కడిగి వేసుకోవాలి. కొత్తగా పాలనకు శ్రీకారం చుడితేనే దేశం ముందుకు వెళ్లగలదు. ప్రధానంగా గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి. ఇది దేశంలో అర్థిక భారాన్ని కలిగిస్తుందే తప్ప మరోటి కాదు. ఈ భారాన్ని తొలగించుకుంటే ఖజానాపై భారం తప్పుతుంది. అలాగే రాష్ట్రాల్లో ప్రశాంత వాతావరణం ఉంటుంది. ఇదే సమయంలో రాష్ట్రాల హక్కులకు ఇబ్బంది కలిగించే ప్రయత్నాలను ఎదుర్కోవడానికి, అధిగమించడానికి, పోరాడటానికి, ప్రతిఘటించడానికి రాష్ట్రాలు సమిష్టితో ముందుకు వెళ్లాల్సి ఉంది. అన్ని ÷ూష్ట్రాల ముఖ్యమంత్రులు ఏకం కావాల్సి ఉంది. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల సముదాయాన్ని ఏర్పాటు చేయాలి. రాష్ట్రాలకు మరిన్ని హక్కులు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేకున్నా ఉన్న హక్కులను కాలరాయకుండా చూడాలి. ఇందుకు ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా నిబద్దతగా పాలన చేయాలి.

రాజ్యాంగబద్దంగా నడుచుకోవాలి. ఇది జరగాలంటే రాజకీయాల హద్దులు దాటి ఐక్యంగా కలిసి రావాల్సి ఉంటుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణం దృష్ట్యా, భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావడం, ఐక్య ఫ్రంట్ ఏర్పాటు చేయడం చాలా ముఖ్యం. భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలు కలిస్తేనే విజయం సాధ్యమవుతుంది. ఈ విజయమే ఈ దేశానికి, సామాజిక న్యాయం, సమానత్వం, లౌకికవాద ఆదర్శాలకు భరోసానిస్తుంది. అటువంటి విజయాన్ని సాధించేందుకు ప్రతిపక్షం చర్యలు చొరవ చూపుతుందా అన్నది చూడాలి. కమ్యూనిస్ట్ పార్టీ అన్ని సమయాలలో కేంద్ర, రాష్ట్ర సంబంధాల సమస్యను తీవ్రంగా తీసుకుని పోరాడుతోంది. గతంలో కాంగ్రెస్ అవలంబించిన్న విధానాలను బిజెపి దూకుడుగా కొనసాగించిందే తప్ప మార్పులకు శ్రీకారం చుట్టలేదు. ప్రధానంగా రాష్ట్రాల ప్రభుత్వాలను కొత్త తరహాలో కూల్చివేస్తోంది. కేంద్రం-రాష్ట్ర సంబంధాలను ప్రజాస్వామ్యకరించడం వారి ఎజెండాలో లేదని తేలిపోయింది. రాష్ట్రాలకు హక్కుగా ఉన్న వాటి కోసం పోరాడేందుకు కాంగ్రెస్ సిద్ధం కావాలి. గతంలో ఏ ఒక్క అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తడానికి ముందుకు వచ్చినా చర్చలకు అవకాశం లేకుండా చేశారు. కేంద్రం-రాష్ట్ర సంబంధాలను ప్రజాస్వామ్యీకరించడం చాలా అవసరం. తద్వారా రాష్ట్రాల హక్కులు రక్షించ బడతాయి. దేశం ఐక్యత, సమగ్రతను కాపాడేలా చూసుకోవాలి. దీన్ని పరిగణనలోకి తీసుకునే చర్యలు ఇప్పుడు దేశానికి అవసరం. భిన్నత్వంలో ఏకత్వమే మనబలం. సమాఖ్య వ్యవస్థను ధ్వంసం చేయరాదు. 1959లో సభలో మెజారిటీ ఉన్నప్పటికీ కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో ,కేంద్ర-రాష్ట్ర సంబంధాల అప్రజాస్వామిక స్వభావం తెరపైకి వచ్చింది. ఇకపోతే రాష్ట్రాలు విచ్చలవిడిగా అప్పులు చేయడాన్ని అడ్డుకోవాలి. అప్పులు చేసి పందేరాలు చేసే పథకాలను ఆపగలగాలి. ఇష్టం వచ్చినట్లుగా నగదు బదిలీలపై ఆంక్షలు విధించాలి. రాష్ట్రాల రుణ భారాన్ని తగ్గించడం, వారి రుణాలపై వడ్డీని తగ్గించడం, కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను పెంచడం వంటి వాటిపై సమగ్ర చర్చ చేయాల్సి ఉంది.

# పన్నుల భారంతో ఆర్థిక మాంద్యం

**- ప్రజల్లో తగ్గుతున్న కొనుగోలు శక్తి - చమురు ధరలతో ఆర్థికంగా దెబ్బ**

**న్యూఢిల్లీ,మే13:** యుద్దాలు, అంతర్జాతీయ పరిణమాల కారణంగా చమురు, సహజవాయువుల ధరలు విపరీతంగగా పెంచుతూ పోవడం వల్ల దేశంలో తయారీరంగం కుదేలయ్యింది. అలాగే ధరల పెరుగుదలకు కారణమయ్యింది. ఈ ధరలపై పన్నుల వసూళ్లు కూడా పెంచడంతో మరింతగా ఆర్థిక రంగం కుదేవలుతూ వస్తోంది. దీనికి పరిస్కారం కనుగొనకుండా ఆదాయ మార్గం పెరిగిందన్న ధోరణిలో కేంద్రం ఉంది. ఈ చర్యల కారణంగా ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి. కొనుగోలు శక్తి తగ్గుతోంది. వస్తూత్పత్తి పెరుగుతున్నా మార్కెట్ లేకుండా పోతోంది. దీంతో వస్తువుల ధరలు పెరిగి సామాన్యులకు అందుబాటులోకి రాకుండా పోతున్నాయి. అందువల్ల మన పన్నుల విధానాన్ని తక్షణం సమీక్షించాల్సి ఉంది. 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి తగ్గట్లుగా విధానాలు ఉండాలి. నిజానికి యుద్దాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. తరవాత ఇజ్రాయిల్ యుద్ధం కూడా ఇదే పరిస్థితిలోకి నెట్టింది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిణామాల కారణంగా ధరల దాడి తప్పడం లేదు. ప్రధానంగా ఆయిల్, నూనెల ధరలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పెట్రో,గ్యాస్ ధరలు మున్ముందు మరింతగా పెరిగే అవకాశాలు లేవని చెప్పలేం. మంచినూనెల సరఫరా కూడా దెబ్బ తినే అవకాశం ఉన్నందున ఇప్పటికే పామ్ ఆయిల్, సన్‌ప్లవర్ ఆయిల్, సోయా నూనె, వనస్పతి ధరలు కూడా పెరగడం మొదలెట్టాయి. మనదేశ చమురు ఉత్పత్తుల వినియోగంలో 85 శాతం దిగుమతులపై ఆధారపడి జరుగుతుంది. కరోనా వలన, ఇతర కారణాల వలన చమురు ఉత్పత్తుల వినియోగం తగ్గింది. కాని పెరిగిన ధరల వలన వాటికి వెచ్చించే మొత్తం మాత్రం పెరిగింది. ధర పెరిగినంత మాత్రాన పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించలేము. కనుక వాటికోసం మనం వెచ్చించే మొత్తం పెరిగింది. ఐతే కార్మికుల, ఉద్యోగుల వేతనాలు మొత్తం మీద పెరగలేదు. దీంతో మనం ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించి వేస్తున్నాం. ఇతర సరుకుల వినియోగం ఎప్పుడైతే తగ్గిందో, ఆ మేరకు ఆయా రంగాలలో మాంద్యం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. కాని అలా జరగడం లేదు. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడల్లా వాటిమీద వసూలు చేసే పన్నుల మొత్తం కూడా పెరుగు తోంది. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో ధరల పెరుగుదల వలన అదనపు ఆదాయం సమకూరు తోంది. ఆవిధంగా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఉపాధి కల్పన వంటి రంగాలకు ఖర్చు చేయడం బదులు, కార్పొరేట్లకు మరిన్ని రాయితీల్వి డానికో, వారి బకాయిలను మాఫీ చేయడానికో కేంద్రంలోని ప్రభుత్వం వినియోగిస్తోంది. వాస్తవానికి మన దేశంలో పెట్రోలు ధరలో 45.5 శాతం, డీజిల్ ధరలో 39.8 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులకే పోతుంది. పన్ను రూపంలో వసూలు చేసేదా నిలో కేంద్రం రాష్ట్రాలతో భాగం పంచుకోవాలి. అందుచేత మోడీ ప్రభుత్వం నేరుగా పన్ను రూపంలో కాకుండా స్పెషల్ డ్యూటీ, రోడ్ సెస్, ఇన్‌ఫ్రాస్టక్చ్రర్ సెస్ వంటి పేర్లతో వసూలు చేస్తోంది. తరచూ ఆర్థిక మాంద్యం ఏర్పడడం వల్ల సరుకుల వినిమయం తగ్గిపోతుంది. అదే విధంగా ద్రవ్యోల్బణం పెరుగుతూవుంటుంది. మన రూపాయి విలువ పడిపోయినా, సరుకుల ధరలు పెరిగినా అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం 8 శాతం దాటింది. టోకు ధరల సూచి జనవరి 2021తో పోల్చితే జనవరి 2022 నాటికి 13 శాతాన్ని దాటింది. వీటికి తోడు మన దేశ వార్షిక జిడిపి వృద్ధి రేటు ముందు అంచనా వేసినట్టు 9.2 శాతం కాకుండా 8.9 శాతమే ఉండబోతుందని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఒమిక్రాన్, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద ప్రభావం చూపనున్నాయని అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి ఆర్థి దుస్థితికి తాజాఉదాహరణాలు. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. ఐతే మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెట్టివేస్తున్నారు. ఇకపోతే పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడం వలన దాని ప్రభావం రవాణా రంగం మీద పడుతుంది. దాని కారణంగా ఇతర సరుకుల ధరలు కూడా పెరుగుతాయి.

# మరోమారు పాఠశాలలకు బాంబు బెదిరింపులు

**వెంటనే రంగంలోకి దిగి తనిఖీలు చేసిన పోలీసులు**

**లక్నో,మే13:** దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అకతాయిల ఆగడాలు రోజు రోజుకు శృతి మించుతున్నాయి. ఎయిర్ పోర్టులు, పాఠశాలలు, ఆసుపత్రులకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆ క్రమంలో ఆ సమయంలో సదరు సంస్థల సిబ్బంది పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. తాజాగా ఉత్తరప్రదేశ్ లక్నోలోని గోమతి నగర్‌లో పలు పాఠశాలలకు సోమవారం ఉదయం ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే పాఠశాలలోని విద్యార్థులను గ్రౌండ్‌లోకి తరలించి.. మీ పిల్లలను ఇంటికి తీసుకు వెళ్లాలంటూ.. వారి తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం సమాచారం అందించింది. మరోవైపు పోలీసులు, భద్రత సిబ్బంది, బాంబు డిస్పొజబుల్ స్క్వాడ్ బృందం ఆ యా పాఠశాలలకు చేరుకుని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తుంది. ఇంకోవైపు ఆదివారం న్యూఢిల్లీలోని బురారీ, సంజయ్ గాంధీ ఆసుపత్రులకు సైతం బాంబు బెదిరింపులు వచ్చాయి. అలాగే అంతకుముందు న్యూఢిల్లీలోని వివిధ పాఠశాలలకు ఇదే తరహాలో బాంబు బెదిరింపులు అందాయి. ఇక నాగపూర్, గోవా, జైపూర్ విమానాశ్రయాలకు సైతం బాంబు బెదిరింపులు అందాయి. పోలీసులు, భద్రత సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి ఇవన్నీ నకిలీ బెదిరింపులని వారు తేల్చి చెప్పారు. ఇంకోవైపు.. ఈ బాంబు బెదిరింపులపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లిప్‌స్టిక్‌పై నార్త్ కొరియాలో నిషేధం

**మేకప్‌లపైనా అక్కడ ఆంక్షలు**

**ప్యోంగ్యాంగ్,మే13:** ఉత్తర కొరియాలో కఠిన చట్టాలు అమలులో ఉన్నాయి. ఫ్యాషన్ అంశంలో కూడా వాటిని పాటిస్తున్నారు. కాస్మటిక్స్ యూజర్స్‌కు పెనాల్టీ విధిస్తున్నారు. ఎరుపు రంగు లిప్‌స్టిక్ పై ఉత్తర కొరియాలో తాజాగా నిషేధం విధించారు. నిజానికి ఎరుపు రంగుకు కమ్యూజినంతో లింకు ఉన్నా.. ఆ రంగు లిప్‌స్టిక్‌ను నార్త్ కొరియా బ్యాన్ చేయడం గమనార్హం. ఎక్కువగా మేకప్ వేసుకున్నవాళ్లను నార్త్ కొరియన్లు పట్టించుకోరు. మేకప్ వేసుకోవడాన్ని పశ్చిమ దేశాల సంస్కృతిగా ఉత్తర కొరియన్లు భావిస్తున్నారు. ఎరుపు రంగు లిప్‌స్టిక్ వేసుకున్నవాళ్లు ఎక్కువ అట్రాక్టివ్‌గా కనిపిస్తారని కొరియన్లు భావిస్తున్నారు. ఇది ప్రభుత్వ వైఖరికి విరుద్ధమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మహిళలు సాదాసీదాగా ఉండాలన్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకం అన్న విధానాన్ని పాటిస్తున్నారు. అందుకే అక్కడి చట్టాల ప్రకారం.. మహిళలు అతి తక్కువ స్థాయిలో మేకప్ ధరించాల్సి ఉంటుంది.రెడ్ లిప్‌స్టిక్ ఒక్కటే కాదు.. వ్యక్తిగతంగా అందంగా కనిపించాలన్న అంశాలపై ఉత్తర కొరియాలో అనేక ఆంక్షలు ఉన్నాయి. ఇటీవల కాలంలో కిమ్ జాంగ్ ఉన్ సర్కారు అనేక కాస్మటిక్ వస్తువులను బ్యాన్ చేసింది. మహిళలు స్కిన్నీ, బ్లూ జీన్స్ వేసుకోరాదు. బాడీ పియర్సింగ్, హెయిర్‌స్టయిల్స్, ముల్లెట్స్, పొడుగైన కురులు ఉండరాదు. కేవలం సర్కారు అనుమతి ఇచ్చిన హెయిర్‌స్టయిల్స్‌లో మాత్రమే మహిళలు, పురుషులు కనిపించాల్సి ఉంటుంది. కొన్ని సిద్ధాంతపరమైన ఆంక్షలు కూడా నార్త్ కొరియాలో ఉన్నాయి. బ్లాక్ ట్రెంచ్ కోట్లను ధరించరాదు. ఎందుకంటే కిమ్ వేసుకున్న స్టయిల్ డ్రెస్సులను మరొకరు వేసుకోరాదు. తనను ఎవరూ కాపీ కొట్టరాదన్న అభిప్రాయాన్ని కిమ్ వ్యక్తం చేశారు. ఫ్యాషన్ విషయంలో ఎవరు ఎలా ఉంటున్నారో పర్యవేక్షించేందుకు ప్రత్యేక పోలీసులు బృందాలు నిఘా పాటిస్తుంటాయి. ఒకవేళ ప్రజలు ఎవరైనా ఆ ఆంక్షలను ఉల్లంఘిస్తే, వాళ్లు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆడవాళ్లు బ్లూ జీన్స్ వేసుకుంటే వాళ్లకు శిక్ష తప్పదు. కొన్ని సందర్భాల్లో ÷న్ వేస్తారు. కొన్ని సందర్భాల్లో వాళ్ల దుస్తుల్ని చింపేస్తారు. దీని వల్ల వాళ్లు మరోసారి ఆ డ్రెస్సు వేసుకోరన్న అభిప్రాయం ఉన్నది.

## ముస్లిం ఓటర్ల ఐడి పరిశీలించిన మాధవీలత

**కేసు నమోదు చేసిన పోలీసులు**

**హైదరాబాద్,మే13:** నాలుగో విడత లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత తన నియోజకవర్గంలోని ఓ పోలింగ్ బూత్‌లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. బూత్‌లో కూర్చున్న ముస్లిం ఓటర్ల బురఖాలను తొలగించమని కోరి ఓటర్ ఐడీల వెరిఫికేషన్ చేశారు. అజాంపూర్ లోని పోలింగ్ బూత్ నెంబర్ 122లో ఈ వెరిఫికేషన్ చేశారు. హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతపై కేసు నమోదైంది. ఎన్నికల అధికారి రొనాల్డ్ రోస్ ఆదేశాలతో మలక్‌పేట్ పీఎస్‌లో పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఓటర్ల స్లిప్‌లను పరిశీలించారనే ఆరోపణలతో ఆమెపై కేసు నమోదు చేశారు. మాధవీలత ఓటర్ ఐడీలు, స్లిప్‌లను పరిశీలిస్తూ ఓటర్లను తనిఖీ చేస్తున్న వీడియో వెలుగుచూసింది. ఓటర్ల ముఖాలను చూసి, వారిని గుర్తించిన తర్వాత ఓటింగ్‌కు అనుమతించాలని ఆమె అధికారులతో వాగ్వాదానికి దిగారు.ఓటర్ స్లిప్‌ల తనిఖీ ఎన్నికల నియమావళి ఉల్లంఘనే అని చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వికాస్ రాజ్ (అఇక్ష ÷ఎతీజీబ ఖీజీతీ) అన్నారు. ఇక మధ్యాహ్నం 1 గంటకు తెలంగాణలో 40 శాతం పైగా పోలింగ్ నమోదైందని వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో 50 శాతం పోలింగ్ నమోదైందని తెలంగాణ వికాస్ రాజ్ పేర్కొన్నారు.

## చింతమడకలో ఓటేసిన కెసిఆర్ దంపతులు

**ఆందోల్‌లో రాజనర్సింహ, దుబ్బాకలో రఘునందన్ ఓటు**



**సిద్దిపేట,మే13:** సిద్దిపేట జిల్లా చింతమడకలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆయన సతీమణి శోభతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయన వెంట మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలింగ్ బాగా జరుగుతోందన్నారు. 65 శాతానికి మించి పోలింగ్ జరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత దేశంలో ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర అవుతుందని పేర్కొన్నారు. కేసీఆర్ రాకతో చింతమడకలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులకు అభివాదం చేస్తూ తిరుగుపయనం అయ్యారు. :ప్రజాస్వామ్య దేశానికి దశ దిశ చూపేది ఓటు మాత్రమేనని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన సిద్ధిపేట పట్టణంలోని భారత్ నగర్ అంబిటాస్ పాఠశాలలో 114పోలింగ్ భూత్‌లో ఓటు హక్కు వినియోగించు కున్నారు. నేను కుటుంబ సభ్యులతో కలిసి భారత్ నగర్ లో ఓటు హక్కును వినియోగించుకున్నా. రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా ప్రజలు పోలింగ్ లో పాల్గొంటున్నారు. గతం కంటే పట్టణాలలో పోలింగ్ పెరుగుతోంది. ప్రశ్నించే గొంతుక ఉండాలని ప్రజలు ఆలోచిస్తున్నారు. మేధావులు,విద్యావంతులు పోలింగ్‌లో పాల్గొనాలి. ప్రజాస్వామ్యం బలపడాలంటే అందరూ ఓటు వేయాలి. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశం మనది. ప్రజలు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకువాలి' అని హరీశ్ రావు పేర్కొన్నారు.ఇకపోతే మెదక్ బిఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రాటమిరెడ్డి సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో ఓటేశారు. మెదక్ బిజెపి అభ్యర్థి రఘునందర్ రావు దుబ్బాకలో ఓటేశారు. సంగారెడ్డి జిల్లా అందోల్ - జోగిపేట పట్టణంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కుమార్తె త్రిషతో కలిసి 196వ పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణలో అత్యధిక పార్లమెంట్ సీట్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతోంది. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ శెట్కార్ భారీ మెజారిటీతో గెలవబోతున్నారు. 12 - 14 పార్లమెంటు స్థానాలను కాంగ్రెస్ గెలుస్తుంది. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంటుంది. బీఆర్‌ఎస్ పాత్రేమి లేదు' అని రాజనర్సింహా పేర్కొన్నారు.తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కొనసాగుతుంది. ఆ క్రమంలో ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు.

## పోలింగ్ బహిష్కరించిన గ్రామాలు

**తమ గ్రామాలను నిర్లక్ష్యం చేశారని నిరసన**

**హైదరాబాద్,మే13:** తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కొనసాగుతుంది. ఆ క్రమంలో ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. అయితే రాష్ట్రంలోని పలు గ్రామాల ప్రజలు సోమవారం జరుగుతున్న పోలింగ్‌ను బహిష్కరించారు. తమ గ్రామ సమస్యలు పరిష్కరించడం లేదంటూ ఆయా గ్రామాల ప్రజలు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. నాగర్ కర్నూలు మండలంలోని బల్మూర్‌లో మైనింగ్‌కి ప్రభుత్వం ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.ఆక్రమంలో పోలింగ్‌ను బహిష్కరించి నట్లు వారు తెలిపారు. అలాగే ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు మండలం రాయమా దారంలో గ్రామస్తులు సైతం పోలింగ్‌ను బహిష్కరించారు.ఎన్‌ఎస్పీ కాలువపై వంతెన నిర్మించలేదని వారు ఈ సందర్భంగా ఆరోపించారు.ఈ నేపథ్యంలో పోలింగ్ బహిష్కరించినట్లు పేర్కొన్నారు.అదే విధంగా యాద్రాద్రి జిల్లా పోచంపల్లి మండల ంలోని కనుముక్కల గ్రామస్తులు ఈ ఎన్నికలను బహిష్కరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా ధాన్యం తడిసిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రాజకీయ నాయకులకు విజ్ఞప్తి చేసినా.. వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇస్తే.. ఓటు వేసేందుకు తామంతా సిద్దమని కనుముక్కల గ్రామస్తులు ఈ సందర్భంగా తెలిపారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com